## జడ్పీలో 8 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు



చిత్తూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త: జిల్లా పరిషత్ పరిధిలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న 8 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జడ్పీ ఛైర్మన్ ఛాంబర్‌లో శనివారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడులు పదోన్నతులు పొందిన జూనియర్ అసిస్టెంట్లకు ఉత్తర్వులు అందజేశారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## శ్రీకాళహస్తిలో నాగుల చవితి



శ్రీకాళహస్తి, అక్టోబర్ 25 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలోని పలు చోట్ల నాగుల చవితి పూజలను నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహిళా భక్తుల సౌకర్యార్థం సన్నిది వీధిలోని నాగాల పుట్ట వద్ద విస్తృత ఏర్పాట్లు చేసారు. పలు మార్లు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి పర్యవేక్షించారు. ఉదయం నుంచి నాగాల పుట్ట వద్ద ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పూజలు నిర్వహించగా ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి నాగుల చవితి ప్రాధాన్యతను వివరించారు. ఏర్పాట్లును ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి పర్యవేక్షించారు. కాగా పానగల్‌లోని పొన్నాలమ్మ ఆలయంలో, సంపతీశ్వరాలయంలోని నాగశిలల వద్ద,సంతమైదానంలోని గంగమ్మ ఆలయంలో ముత్యాలమ్మ గుడిలోని నాగశిలల వద్ద విశేష పూజలు జరిపించుకున్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగులచవితి





సూళ్లూరుపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త నాగులచవితి పర్వదినాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి దేవస్థానంలోని నాగుల పుట్ట వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అలాగే పట్టణంలోని బాలాంజనేయస్వామి దేవస్థానం, మన్నారుపోలూరు సెంటర్, సాయిబాబా గుడి వద్ద గల నాగేంద్రస్వామి పుట్టలకు భక్తులకు తరలివెళ్లి పూజలు చేశారు. అలాగే పట్టణంలోని శ్రీనాగేశ్వర స్వామి దేవస్థానంలో నాగశిలలకు ప్రత్యేక పూజలు చేసి శ్రీ నాగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. దేవస్థానం ఛైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ప్రధాన అర్చకులు పేటేటి సునీల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

### నాగులచవితిన

## ఆదిశేషునిపై ఆపదమొక్కులవాడు

తిరుమల, అక్టోబర్ 25 ప్రభాతవార్తప్రతినిధి: నాగులచవితిన శనివారం రాత్రి మలయప్పస్వామి ఏడుతలల ఆదిశేషుని వాహనంపై ఊరేగారు. శనివారం విశేషమైన రోజున వరుణదేవుడు పలుకరిస్తుండగా పెద్దశేషవాహనాన్ని అధిరోహించిన స్వామివారు ఆలయ మాఢవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు గోవిందనామస్మరణలతో పులకించారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.



## శోకసముద్రంలో వేదాంతపురం అగ్రహారం

### -మరో ముగ్గురి మృతదేహాలు వెలికితీత



తిరుపతిరూరల్, అక్టోబర్ 25 ప్రభాతవార్త: స్వర్ణముఖిలో ఈత కెళ్లి ప్రమాదశాత్తు గల్లంతయిన తేజు, ప్రకాశ్, మునిచంద్ర మృతదేహాలను వెలికితీసారు. శనివారం ఉదయం నుంచి ఎస్‌డిఆర్‌ఎఫ్, ఫైర్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది నిరంతరాయంగా శోధన చేసి ముగ్గుర యువకుల మృతదేహాలను వెలికితీసారు. శుక్రవారం స్వర్ణముఖి నదిలోకి ఈతకు వెళ్ళిన ఏడుగురు యువకులలో ప్రమాదశాత్తు నలుగురు మునిగిపోయిన విషయం తెల్సిందే. శుక్రవారం సాయంత్రానికి బాలు మృతదేహాన్ని వెలకితీయగా శనివారం ఉదయం నుండి ఎస్‌డిఆర్‌ఎఫ్, ఫైర్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది విస్తృతంగా ముమ్మర గాలింపు చర్యలు చేసారు. ముందుగా తేజు మృతదేహాన్ని, మధ్యాహన సమయానికి ప్రకాశ్ మృతదేహాన్ని సాయంత్రానికి మునిచంద్ర మృతదేహాన్ని వెలికితీసారు.

తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం అగ్రహారం గ్రామానికి చెందిన ఏడుగురు యువకులు స్వర్ణముఖి నదిలో సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. వారిలో నలుగురు లోతైన నీటిలో ఇసుక మేటల్లో చిక్కుకుని గల్లంతయిన విషయం తెల్సిందే. శుక్రవారం రాత్రికి బాలు అనే యువకుడి మృదేహం లభ్యం కాగా మిగిలిన తేజు, ప్రకాశ్, మునిచంద్ర మృతదేహాలను శనివారం వెలికితీసారు.

**శోకసముద్రంలో వేదాంతపురం**

వేదాంతపురం అగ్రహారంలో నలుగురు యువకులు మృత్యవాత పడటంతో గ్రామంలో శోకసముద్రంలో మునిగిపోయింది. గ్రామం అంతటా విషాదఛాయలు అలుముకున్నాయి. ఒకే ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందటంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు.

**ఎస్పీ, ఎమ్మెల్యే నాని నిరంతర పర్యవేక్షణ**

తిరుపతిజిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నానిలు సంఘటనా స్థలంలో స్వయంగా పర్యవేక్షిస్తూ సహాయక చర్యలను పటిష్టం చేసారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది, ఫైర్ సర్వీస్ బృందాలు కలిసి రాత్రంతా



గాలింపు చర్యలు చేపట్టారు. డ్రోన్‌ల సాయంతో నది పరిసర ప్రాంతాలను విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీసరు. ఈ ఘటనపై ఎస్పీ తీవ్ర విచారం వ్యక్త చేస్తూ, బాధిత కుటుంబాలకు పూర్తి సహాయాన్ని అందిస్తామని తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మృతుల తల్లిదండ్రులను ఓదార్చారు. మృతదేహాలు ఆచూకి తెలిసే వరకు అక్కడే ఉండి సహాయ చర్యలు చేపట్టారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుండి సహాయ సహకరాలు అందించుటకు కృషి చేస్తామని తెలిపారు.

## వైద్యుల సమ్మెకు ఫుల్‌స్టాప్

### - ఇక విధుల్లోకి వైద్యాధికారులు



5: సమ్మె విరమించిన వైద్యులతో చర్చిస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి.

చిత్తూరుహెల్త్, అక్టోబర్ 25 ప్రభాతవార్త: పిహెచ్‌సి, యుపిహెచ్‌సిల్లోని వైద్యాధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 3 నుండి తలపెట్టిన నిరవధిక సమ్మెకి ఫుల్‌స్టాప్ పడింది. సమ్మెలో వున్న డాక్టర్లు సోమవారం నుండి విధులకు హాజరు కానున్నారు. ప్రభుత్వ వైద్యులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత నెల 28వ తేదీ నుండి ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు ప్రభుత్వం నుండి స్పందన రాకపోవడంతో ఈ నెల 3వ తేదీ నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు డాక్టర్లు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యశాఖ మంత్రితో వైద్య ఉద్యోగుల సంఘ ప్రతినిధులు శనివారం నిర్వహించిన చర్చలు ఫలప్రదం అయ్యాయి. 2025-26 విద్యాసంవత్సరంలో పీజీ మెడికల్ ఇన్ సర్వీసు కోటాను 20 శాతం, 2026-27లో 15 శాతం కోటాను కొనసాగించడానికి వైద్య మంత్రి సత్యకుమార్ స్పష్టమైన హామీ ఇచ్చారు. అలాగే గతంలో అమల్లో వుండి నిలిచిన డిఎన్బీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించడానికి మంత్రి సానుకూలంగా స్పందించారు. అలాగే ఇతర సమస్యలను సైతం చర్చించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని వైద్య ఉద్యోగుల సంఘ నేతలకు మంత్రి హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లాలో ఇప్పటి వరకు సమ్మెలో వున్న ప్రభుత్వ వైద్యులు శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణిని ఆమె ఛాంబర్‌లో కలిసి ఇకపై రోగులకు అందుబాటులో వుండి వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి...

### ఇద్దరికీ గాయాలు..



రేణిగుంట అక్టోబర్ 25 ప్రభాతవార్త రేణిగుంట మండలం మల్లవరం క్రాస్ వద్ద శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ ఆసుపత్రి రీసెర్చ్ ఇన్సిట్యూట్ నందు చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం మేరకు పి.వెంకటేష్ అతని భార్య ఇంద్రజ శ్రీకాళహస్తి మండలం కొన్నతనేరు నుండి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మల్లవరం సర్వీస్ రోడ్డు ఎంట్రన్స్ వద్ద ఎం, చరణ్ టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా రోడ్డుపైకి రావడంతో రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ఇంద్రజ, చరణ్ లకు దగ్గర్లోని శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల రీసెర్చ్ ఇన్సిట్యూట్ కు చికిత్స నిమిత్తం తరలించారు. రేణిగుంట సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

### మాజీ మంత్రి ఆర్.కె.రోజా

పుత్తూరు (నగరి), అక్టోబరు 25 ప్రభాతవార్త : రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైసిపికి చెందిన మాజీ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. శనివారం తన కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు.





ఆమె మాట్లాడుతూ మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి కొత్తగా 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారన్నారు. వాటిలో ఆరు మెడికల్ కాలేజీలు ప్రారంభమై విద్యార్థులు వైద్య విద్య అభ్యసిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మిగిలిన 11 కాలేజీలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించి, నిర్వహించకుండా ఆర్థిక లోటు సాకుతో ప్రైవేటు వ్యక్తులకు ధారాధత్తం చేస్తోందని విమర్శించారు. ముడుపుల కోసమే మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. దీని వల్ల పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. కోటి సంతకాలతో ప్రభుత్వ మెడలు వంచాలని కోరారు. తమ పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేస్తుందనే విషయాన్ని గుర్తు పెట్టుకుని కోటి సంతకాల్లో భాగస్వాములవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రాహుల్ రాజారెడ్డి తదితర వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రహరీ గోడ కూలి కార్మికుడు మృతి

## మరో ముగ్గురికి గాయాలు

కుప్పం, అక్టోబర్ 25 ప్రభాతవార్త



స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద రాజు కాలువలో పారిశుద్ధ్య పనులు చేస్తుండగా అకస్మాత్తుగా ప్రహరీగోడ కూలింది. ఈ సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అర్బన్ సిఐ శంకరయ్య తెలిపిన మేరకు వివరాలిలా.. దొర్నిపాడు మండలం కొత్తపల్లికి చెందిన శివయ్య (49), నెల్లూరుజిల్లాకు చెందిన హజరతయ్య(62), వెంకటేష్ (35), సురేష్(30)లు కుప్పం మున్సిపాలిటీలో రాజుకాలువల శుభ్రం చేసేనిమిత్తం పనికి వచ్చారన్నారు. శనివారం స్థానిక బస్టాండు వద్ద వీరు కాలువలో పని చేస్తుండగా హఠాత్తుగా ఓ ప్రహరీగోడ వీరిపై పడిందన్నారు. స్థానికులు హుటాహుటిన బాధితులను కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించగా శివయ్య మృతి చెందాడన్నారు. తీవ్రంగా గాయపడ్డ హజరతయ్యను పిఇఎస్‌కు తరలించామని. మరో ఇద్దరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## తిరుపతిని మొదటి స్థానంలో నిలుపుతాం : ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి విద్య, అక్టోబర్ 25 ప్రభాతవార్త:



పిఎం సూర్యఘర్ పథకం అమలులో తిరుపతిని రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు అధికారులు,ఎన్డీఏ కూటమి నాయకులు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసర ముందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. ముప్పయ్ వేల పిఎం సూర్యఘర్ కనెక్షన్స్ తిరుపతిలో ఏర్పాటు చేయాలనేది లక్ష్యమని ఆయన చెప్పారు. శనివారం కచ్చపి ఆడిటోరియంలో పిఎం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోది ఎంతో దూరదృష్టితో పిఎం సూర్యఘర్ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,యువనాయకులు నారా లోకేష్‌లు పిఎం సూర్యఘర్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పోరేషన్ సహాయ కమిషనర్ అమరయ్య,డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా,బిజేపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, ఎస్పీడిసిఎల్ ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈలు బాలాజీ,గంగాధర్,రిటైర్డ్ ఎస్ ఈ మునిశంకర్, గంగమ్మగుడి పాలకమండలి ఛైర్మన్ మహేష్‌యాదవ్, జనసేన నగరఅధ్యక్షులు రాజారెడ్డిలు పాల్గొన్నారు.

### గ్రేటర్ తిరుపతిలో తిరుపతిరూరల్ మండలాన్ని

## విలీనం చేయం

### -మండల సర్వసభ్య సమావేశంలో ఏకకంఠ తీర్మానం

తిరుపతిరూరల్, అక్టోబర్ 25 ప్రభాతవార్త:





తిరుపతిరూరల్ మండలాన్ని గ్రేటర్ తిరుపతిలో విలీనం చేయటానికి ఆయా గ్రామ సర్పంచ్‌లు విముఖత చూపా రు. గ్రేటర్ తిరుపతిలో విలీనమైతే ఇంటిపన్నులు అధికమైతాయని, బిల్డింగ్ అనుమతు లకు అధిక మొత్తాలలో చెల్లించాల్సి ఉంటుందని పలువురు సర్పంచ్ తెలిపారు. తిరుపతిరూరల్ మండలాన్ని గ్రేటర్‌లో విలీనం చేయబోమని ఏకవాక్య తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. శనివారం తిరుపతిరూరల్ మండల సర్వసభ్య సమావేశంలో మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆయా శాఖల గురించి చర్చించారు. ముఖ్యంగా గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువుగా ఉందని, అలాగే పాడి ఆవులను, గేదెలను రోడ్డుపై వదిలేయడం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఈసమావేశంలో ఇన్‌చార్జి ఎంపిడిఓ దయాసాగర్, ఉప మండలాధ్యక్షులు విడుదల మాధవరెడ్డి, యశోధ, జట్పిటిసి రత్నమ్మ, అర్బన్ డిప్యూటీ తహశీల్ధార్ రామచంద్ర సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యధర్శులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## "మొంథా" తుఫాను ప్రభావం... భారీ వర్షాలు

**- జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటన- చెరువులకు గండి పడే ప్రదేశాలు గుర్తించి ఇసుక బస్తాల ఏర్పాటుకు చర్యలు-**
**- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పక్కా చర్యలు - మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు- ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు,**
**గత ఈతగాళ్ళు సిద్ధంగా వుండేలా ఏర్పాట్లు : అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**

చిత్తూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త: జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం వున్న నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి శనివారం వర్షాల విపత్తు నిర్వహణపై ఎస్పీ తుషార్ డూడితో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమీషనర్లు, తహసిల్దార్లు, ఎంపిడిఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ఇవ్వడం జరిగిం దని, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వుండి నిరంతరం అందుబాటులో వుండాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖలో డివిజన్ స్థాయి నుండి క్షేత్ర స్థాయి వరకు అధికారులు,



సిబ్బంది అప్రమత్తంగా వుండాలని, శిధిలావస్థలో వున్న భవనాలు, పాఠశాలలను గుర్తించి ఆ ప్రదేశాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే 80 శాతం నిండిన చెరువులను గుర్తించి వాటిని పర్యవేక్షించించి జిల్లా స్థాయి ఇరిగేషన్ శాఖ అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. అలాగే చెరువులకు గండ్లు పడే అవకాశం వున్న ప్రదేశాలను గుర్తించి ఇసుక బస్తాలను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండల స్థాయిలో ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ గుంతలు, వాగులు, కాలువలు, వంతెనల వద్ద నీరు అధికంగా ప్రవహించే ప్రాంతాల్లో, అలాగే పట్టణ, నగర ప్రాంతాల్లో నాలాల్లో గుంతలు ఎక్కువగా వున్న ప్రాంతాల్లో వాహనాలను మళ్ళించి ఆ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను వుంచాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం, విపత్తు సంభవించే అవకాశం వుంటే, జరిగిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సైతం సమాచారం అందించాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి,జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా వుండాలి : కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 25 ప్రభాతవార్త : "మొంథా" తుఫాను ప్రభావంతో జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో తుఫాను సందర్భంగా తీసుకోవలసిన చర్యలపై సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "మొంథా" తుఫానును తేలికగా తీసుకోరాదని, ఈ నెల 27,28,29 తేదీలలో ఇది మరింత తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రత్యేకించి మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు వారికి





కేటాయించిన కేంద్రాలలో తప్పనిసరిగా ఉంటూ తుఫాను సందర్భంగా ఎప్పటికప్పుడు తలెత్తే పరిస్థితులపై ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్.పి సుబ్బారాయుడు మాట్లాడుతూ "మొంథా" తుఫానును ఎదుర్కొనేందుకు అన్ని సహాయక చర్యలు తీసుకోవడంలో భాగంగా, జిల్లాలోని ఆర్ డిఓ లు, తహసీల్దార్ లు, ఇతర లైన్ డిపార్టుమెంట్లు సమన్వయము చేసుకోవాలన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్ లో డి ఆర్ ఓ నరసింహులు, ఆర్ డి ఓ లు, తహసీల్దార్ లు, మున్సిపల్ కమీషనర్ లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీవా నది పొంగే అవకాశం

- ప్రజలకు టుటౌన్ పోలీసులు హెచ్చరికలు

చిత్తూరుహెల్త్, అక్టోబర్ 25 ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం వుందని వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపధ్యంలో చిత్తూరు నీవానది పొంగే అవకాశం వుందని ఆ నది పరివాహక ప్రదేశాల్లో నివాసం వుంటున్న ప్రజలు ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళాలని టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య కోరారు. నీవా నవి పరివాహక ప్రాంతాల్లో నివాసం వుంటున ప్రజల ఇళ్ళలోకి నీవా నది నీరు వచ్చే అవకాశం వుందని, ఇళ్ళ ముంపు ముప్పు ఏర్పడే అవకాశం వుంటుందని హెచ్చరించారు. నీవానది పరివాహ ప్రాంతాల్లో నివాసం వుంటున్న ప్రతి ఒక్కరు తమ ప్రాణాలను రక్షించుకోవడానికి జాగ్రత్తలు తీసుకుని ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు ఎత్తైన ప్రదేశాలకు తరలివెళ్ళాలని ఆయన కోరారు.

## నిరంతరం పిహెచ్‌సిల్లో అందుబాటులో డాక్టర్లు

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

**చిత్తూరుహెల్త్, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం వుండటంతో పిహెచ్‌సి, యుపిహెచ్‌సిల్లో నిరంతరం వైద్యులు అందుబాటులో వుండి రోగులకు వైద్యం అందించడానికి సిద్ధంగా వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ వర్షాల నేపథ్యంలో శనివారం వైద్య అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 26వ తేదీ నుండి 30వ తేదీ వరకు భారీ నుండి అతి భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం వుందని, సెలవులో వున్న డాక్టర్లు సత్వరం విధుల్లో చేరాలని ఆదేశించారు. అలాగే అన్ని రకాల వాక్సిన్‌లో అందుబాటులో వుంచుకోవాలని, ముఖ్యంగా చిన్న పిల్లలకు వేసే వాక్సిన్ చెడిపోకుండా జనరేటర్లలో నిల్వ చేయాలని ఆదేశించారు. అలాగే క్షేత్ర స్థాయిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శాఖ అధికారులు పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ గిరి, శ్రీవాణి, ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లీంల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

- రికార్డుల కంప్యూటరీకరణ ఓరియంటేషన్ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ఇఓ సర్కార్



**చిత్తూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ముస్లీంల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సర్కార్ పేర్కొన్నారు. చిత్తూరు కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శనివారం జరిగిన వక్ఫ్‌బోర్డు రికార్డుల కంప్యూటరీకరణ ఓరియంటేషన్ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఇఓ సర్కార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ సిఇఓ మహ్మద్ ఆలీ వర్చువల్ విధానంలో హాజరై ముత్తవల్లీలతో మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను పరిరక్షించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఉమీద్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రతి ఒక్కరు ఈ పోర్టల్‌లోకి వెళ్ళి వక్ఫ్ ఆస్తుల వివరాలను పొందుపరచాలని కోరారు. ఏపి వక్ఫ్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సర్కార్ మాట్లాడుతూ వక్ఫ్ రికార్డులు, ఆస్తులు, ఆదాయంలో పారదర్శకత పెంచడానికి ఈ కార్యక్రమంను పక్కాగా అమలు చేయాలన్నారు. అలాగే వక్ఫ్ బోర్డు వక్ఫ్ ఆస్తుల నుండి కేవలం 7 శాతం ఆదాయం మాత్రమే తీసుకుంటోందని, మిగిలిన 93 శాతం ఆదాయంతో ముస్లీం సమాజ సంక్షేమానికి ముత్తవల్లీలు, వక్ఫ్ అధ్యక్షులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి చిన్నారెడ్డి, చిత్తూరు ఎపిఎస్ఎంఎఫ్‌సి ఇడి హరినాధరెడ్డి, జిల్లా వక్ఫ్ ఇన్స్‌పెక్టర్ రియాజ్, పెద్ద ఎత్తున ముత్తువల్లీలు పాల్గొన్నారు.

## కేశవ చౌదరికి జాతీయ స్థాయి ఐకాన్ అవార్డు

పెనుమూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త:



2025 సంవత్సరానికి స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అసోసియేషన్, నిషా అందించే ఐకాన్ అవార్డు పెనుమూరు వెంకటేశ్వరా విద్యానికేతన్ పాఠశాల అధినేత ఎ.కేశవ చౌదరి అందుకున్నారు. విశాఖపట్నంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపి భరత్, నిషా అధ్యక్షులు కుల భూషణ్ వర్మ, అపస్మా చీఫ్ కృష్ణారెడ్డిలు కేశవచౌదరికి ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ తమ వెంకటేశ్వర విద్యాసంస్థల ద్వారా మూడు దశబ్దాలకు పైగా ఎంతోమంది విద్యార్థులకు విద్యా సేవలు అందించడం జరిగిందని, తమ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు ప్రస్తుతం అనేక రంగాల్లో ఉన్నత స్థానాల్లో వున్నారన్నారు. తమ సేవలు అందించిన తనకు అవార్డు అందించడం సంతోషంగా వుందన్నారు. తమ సంస్థకు అవార్డు దక్కడంపై పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వెలిబుచ్చారు.

## వైకాపాను వీడి ఇరవై కుటుంబాలు తెదేపాలోకి



***కుప్పం, అక్టోబర్ 25 ప్రభాతవార్త*** మండలంలోని మిట్టపల్లి పంచాయతీకి చెందిన ఇరవై కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరాయి. శనివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో వీరు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్‌ల సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీక ండువాలుకప్పి సాదరంగా ఆహ్వానించారు.సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నచ్చి తాముపార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. నేతలు మాట్లాడుతూ రాష్ట్రం,కుప్పం అభివృద్ధికి శ్రమిస్తున్న సిఎం చంద్రబాబునాయుడుకు మరింతమంది ప్రజలు అండగా నిలబడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడ సభ్యుడు రామచంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్ శరవణ, పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, నేతలు అన్నాదొరై, ఎవి రవి, లీలా వెంకటేష్, హైదర్ వలీ, చలపతి, సంతోష్, వల్లెప్ప, కనకరాజు, వేడి, శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఛలో హైదరాబాద్ కార్యక్రమం జయప్రదం చేయాలి

కుప్పం,అక్టోబర్ 25 ప్రభాతవార్త



సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ పద్మశ్రీ మందకృష్ణమాదిగ ఆదేశాల మేరకు నవంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ నిరసనప్రదర్శనను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, కుప్పం ఎంఎస్‌పి కో ఇన్‌చార్జ్ వెంకటేష్ కోరారు. దేశవ్యాప్తంగా దాడులకు దిగే వ్యక్తులకు,శక్తులకు భయం కలిగేలా ఈ ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేసేందుకు కుప్పంనుంచి అధిక సంఖ్యలో ప్రజలుహాజరు కావాలని కోరారు.కార్యక్రమంలో నేతలు పాపన్న, గోవింద, రాజేష్, జయప్ప, పళని, రమేష్,వెంకటేష్, శంకర్‌గణేష్,రాజశేఖర్ పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయాభివృద్ధికి సహకరించండి:



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం అభివృద్ధికి టిటిడి సహకరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి శనివారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన టిటిడిజేయిఓ వెంకయ్యచౌదరిని విన్న వించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,ఎఇఓ మోహన్‌లు వేదపండితులతో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయనకు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. జ్ఞాన ప్రసూనాంబ సదన్‌లో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి చర్చించారు.ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు బస సదుపాయం కల్పించాలని కోరారు. కాగా టిటిడి సారధ్యంలో సామాన్యులకు అందుబాటులో ఉండేటట్లు కళ్యాణ మండపాన్ని నిర్మించాలని ఊరందూరు వద్ద ఉన్న కళ్యాణ మండపాన్ని తుది దశ పనులు పూర్తి చేసి ప్రారంభించాలని ఎంఎల్ఏ కోరారు. ప్రతిపాదనలు పంపాలని పరిశీలించి సాధ్యమైనంత వరకు అనుమతిస్తామని జేయిఓ భరోసా ఇచ్చారు.

## యువకుల ఉత్సాహమే పార్టీకి పునాదులు: డాక్టర్ సిపాయి



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త** యువకుల ఉత్సాహమే వైకాపాకు పునాదులని ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. శనివారం ఆయన్ను యూత్ అధ్యక్షుడు మల్లెం బాకం మునికృష్ణారెడ్డి కలసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్బంగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో పార్టీకి మంచి క్యాడర్ ఉందన్నారు.అంతేకాక కూటమి వచ్చినా మన పార్టీ క్యాడర్ చెక్కు చెదరలేదన్నారు.వారికి అండగా యువత ఉండాలన్నారు. ప్రజల సమస్యలపై నిత్యం స్పందిస్తూ వారికి మేమున్నామనే భరోసా కల్పించాలని సిపాయి సుబ్రమణ్యం అన్నారు. యువకులు ఉత్సాహంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యకర్తలను ఇబ్బంది పెడితే డిజిటల్ బుక్‌లో నమోదు చేయించుకోవాలన్నారు.నేడు పార్టీ నాయకత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీ కరణ చేయటాన్ని నిరసిస్తూ కోటి సంతకాల ఉద్యమాన్ని చేపట్టామని విజయవంతం చేయటానికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో అత్యధిక ఓటు బ్యాంకు వన్నెకుల క్షత్రియులున్నారని వారి సేవలను ఉపయోగించుకోవాల్సి ఉందన్నారు. వారికి పార్టీ నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కోరారు. గతంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం వన్నెకుల క్షత్రియుల సేవలను అపారంగా ఉపయోగించుకొని చివరకు మొండి చేయి చూపిందన్నారు. ఈ కార్యక్రమాల్లో వైకాపా సలహాదారు సున్నపు లక్ష్మీపతిరెడ్డి, మాజీ వ్యవసాయమార్కెట్ కమిటి ఛైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎనిమిది మంది జూదరులు అరెస్టు

సదుం అక్టోబర్ 25 ప్రభాతవార్త

మండల పరిధిలో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు చదుము ఎస్సై షేక్షావల్లి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు శనివారం మధ్యాహ్నం ఒంటిగంటప్రాంతంలో రాబడిన సమాచారం మేరకు ఎస్సై, పోలీసు సిబ్బందితో పాటు చెరుకువారిపల్లి పంచాయతీ, బాపన చెరువు మొరగ దగ్గర గల సోమశేఖర్ రెడ్డి మామిడి తోపులో తనిఖీలు చేపట్టారు. అక్కడ మామిడి చెట్టు కింద ఎనిమిది మంది లోపల బయట అను మంగాతాయి జూదము ఆట ఆడుతుండగా దాడి చేశామని చెప్పారు. వారిని అరెస్ట్ చేసి వారి దగ్గర 72,600/ సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

## ఉపాధి పనులపై ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలి

-ఐరాల మండల మీట్



ఐరాల,అక్టోబర్ 25 ప్రభాతవార్త: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో జరిగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గురించి స్థానిక ఎంపీటిసిలు, సర్పంచ్‌లకు తప్పనిసరిగా సమాచారం అందించాలని ఎంపీపీ చింతం మోహన్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మంది రంలో ఎంపిపి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లా డుతూ ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా పారిశుద్య పనులు నిర్వహించాలని సంభందింత అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో త్రాగునీటి పైపులు లీకేజిలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. అలాగే మండలంలో శాఖల వారిగా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈసమావేశంలో మండల వైస్ ఎంపిపిలు నిత్య, రోజా, తహశీల్దార్‌లోకేశ్వరి,ఎంఈఓ రుష్యేంద్రబాబులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు ఉన్నందువల్ల ప్రజల్లో అప్రమత్తంగా ఉండండి



సోమల అక్టోబర్ 25 (ప్రభాతవార్త)

రానున్న మూడు రోజులు సోమల మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండవల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ మధుసూదన్ పేర్కొన్నారు. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలా చోట్ల కల్వర్టులు తెగి రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులు మొరవలు వెళ్లి వర్షపు నీరు ఇంకా ప్రమాద స్థాయిలో వెళుతున్నాయి... దీంతో తాసిల్దార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి తెగిన కల్వర్టులను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో కి వెళ్లాలని వారిని అప్రమత్తం చేశారు. రెవెన్యూ పంచాయతీ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ఎమర్జెన్సీ ఎమర్జెన్సీ పరిస్థితుల్లో పరిస్థితులలో వారి సేవలో వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.

## రాష్ట్ర దూదేకుల నూర్ బాషా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడుగా నూరేషా



రొంపిచర్ల, అక్టోబర్ 25, ప్రభాతవార్త

రాష్ట్ర దూదేకుల, నూర్ బాషా సంక్షేమ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడుగా రొంపిచెర్ల మండలానికి చెందిన గుమ్మడూరు నూరేషాను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎస్ బాజీ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతపురంలో జరిగిన రాష్ట్ర దూదేకుల నూర్ బాషా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ దూదేకుల నూర్ బాషా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దూదేకుల కులస్థుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుమ్ముడూరు నూరేషా మాట్లాడుతూ తమ పై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడు పదవి ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నియమ నిబంధనలకు లోబడి పని చేస్తానని తెలిపారు.

## అటవీశాఖ వారి హెచ్చరిక

కల్లూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త

కల్లూరు రిజర్వు ఫారెస్ట్‌లో ఒంటరి ఏనుగు సంచారం వున్నది. అందువల్ల కల్లూరు అటవీ సరిహద్దు ప్రాంతంలో ఉండే గ్రామస్తులు రాత్రి సమయంలో పంటపొలాల్లో బస చేయరాదు. కల్లూరు నుండి గంతవారిపల్లి వైపు ప్రయాణించే ప్రజలు మరియు కల్లూరు పశ్చిమ ప్రాంతంలో వుండే గ్రామాల ప్రజలు రాత్రి సమయంలో రోడ్డు ద్వారా ప్రయాణించే వారందరు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తెల్లని దుస్తులు ధరించి అటవీ సమీపంలో తిరగరాదు. ఏనుగు గురించి సమాచారం తెలిసినచో 9550067503కి తెలియజేయాలని కోరారు.

## మృతుడి కుటుంబానికి 8లక్షలు ఆర్థికసాయం

- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్







**కుప్పం, అక్టోబర్ 25ప్రభాతవార్త** కుప్పంలో పారిశుద్ధ్య పనులకు వచ్చి గోడ కూలి శివయ్య మృతి చెందడం బాధాకరమని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రభుత్వం తరపున 5లక్షలు, పార్టీ తరపున 3లక్షలు బాధిత కుటుంబానికి అందించామన్నారు. అలాగేఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు 50వేల వంతున రూ 1.50లక్షలు అందించారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ డా॥ కంచర్లశ్రీకాంత్, కడ పి.డి.వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ కుప్పం ఏరియా ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి అండగా ఉంటామని పేర్కొన్నారు. బాధితులు త్వరగా కోలుకునేలా మెరుగైనవైద్య సేవలు అందించాలని వైద్యులను డా॥ కంచర్ల ఆదేశించారు. కార్యక్రమంలో అర్బన్ పార్టీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు జిమ్‌దాము,సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎంఎవై పథకంపై అవగాహన కార్యక్రమం

శాంతిపురం, అక్టోబర్25 ప్రభాతవార్త



ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పిఎంఎవై) పథకంలో ఇళ్ల నిర్మాణంపై శనివారం మండల కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు అవగా హన కార్యక్రమంను ఎంపిడిఓ పిఆర్ కుమార్ నిర్వహించారు. ఈ పథకంలో తొలుత ఇళ్ల స్థలాలు ఉండి ఇళ్లు లేనివారికి పథకంలో లబ్ది కలిగించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఈ విషయంగా సర్వే జరుగుతోందన్నారు.అర్హులు ఉం టే ప్రజాప్రతినిధులు వారి వివరాలు తెలియజేయాలన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్,నేతలుజనార్ధనరెడ్డి,విశ్వనాథనాయుడు, మణి,గోపాల్, రాజేంద్ర, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

## సాయంసంధ్యవేళ అలరించిన ఇంద్రధనుస్సు



రామకుప్పం, అక్టోబర్ 25 ప్రభాతవార్త

మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఇంద్రధ నుస్సు కనువిందుచేసింది. సూర్యుడుఅస్తమించినసమయంలోఆకాశంలో మబ్బులు కమ్ముకుని ఇంద్రధ ను స్సు అలరించింది. అనంతరంతేలిక పాటి జల్లులుమొదలయ్యాయి.స్థానికులనుఈఇంద్రధనుస్సు ఆకట్టుకుం ది.

## పట్టురైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- ప్రభుత్వ విప్ డా॥ కంచర్లశ్రీకాంత్



**కుప్పం,అక్టోబర్ 25 ప్రభాతవార్త** కుప్పం ప్రాంతం లోని పట్టు సాగురైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్లశ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక వాణి మహ ల్‌లో పట్టుశాఖ,కుప్పం ఎఎంసి అధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో రూపొందే పట్టుకు ప్రత్యేకస్థానం ఉందన్నారు. ఇక్కడ మరింత విస్తీర్ణంలో పట్టుసాగు రైతులుచేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల సమస్యలు సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం,పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు మాట్లాడుతూ స్థానికంగా రీలింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలుతీసుకుంటామన్నారు. రైతులు ఆధునిక విధానాలపై అవగాహనపెంచుకోవాలన్నారు. శాస్త్రవేత్త డా॥ భరత్‌కుమార్ రైతులకు నూతన సా ంకేతిక విధానాలపై వివరించారు. పట్టుగూళ్ల అధిక దిగుబడికి తీసుకోవాల్సిన యాజమాన్య చర్యల గురించి తెలిపారు. పట్టుశాఖ జెడి పద్మ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు రైతులు సద్వినియోగంచేసుకోవాలన్నారు. మోహన్‌బాబుమాట్లాడుతూ మల్బరీ రైతులకు ఎకరాకు 22,500రూ.లు, షెడ్ నిర్మాణంకురూ 3,37500, రేరింగ్ స్టాండ్‌కు 34,125 రూ.లరాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ద్వామా ఎపిడి డా॥ సుబ్రమణ్యం, ఎఎంసి డైరెక్ట

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మల్బరీ రైతులు సబ్సిడీ పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి



సిరికల్చర్ అధికారి గణేష్

**వెదురుకుప్పం, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** మల్బరీ రైతులు సబ్సిడి పరికరాలు సద్వినియోగం చేసుకోవాలని సిరికల్చర్ అధికారి గణేష్ పేర్కొన్నారు. మండలంలోని పెరుమాళ్ళపల్లె రైతు భరోసా కేంద్రంలో శనివారం సబ్సిడి పరికరాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం రాయితీతో పరికరాలు అందజేస్తుందని ఉపయోగించుకుని మల్బరీ సాగులో అధిక దిగుబడి సాధించాలని చెప్పారు. గతంతో పోలిస్తే పట్టు పెంపకం చాలా లాభాదాయకంగా ఉందని రైతులు గుర్తించాలని తెలిపారు. ఆధునిక పరిజ్ఞానంతో తక్కువ ఖర్చు ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. అలాగే ప్రభుత్వం మొక్కలు నాటటం నుంచి షెడ్డు నిర్మాణం వరకు ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. అనంతరం రైతులకు బ్రష్ కట్టర్, పవర్ స్ప్రేయర్, బ్యాటరీ స్ప్రేయర్, పవర్ వీడర్ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జీమోహన్ మురళి, సర్పంచ్ బండి శశిఆనంద రెడ్డి, ఎంపిటిసి హరి విజయశేఖర్ రెడ్డి, నాయకులు బియం.రవి, టెక్నికల్ ఆఫీసర్ రమేష్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ ఈశ్వర్ రెడ్డి, ఇంద్రజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విశేష పూజలందుకొన్న వేణుగోపాలస్వామి

చౌడేపల్లి, అక్టోబర్ 25 ప్రభాతవార్త



స్థానిక రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పూజలో పాల్గొని స్వామివారి పవిత్ర తీర్థ ప్రసాదాలను గైకొన్నారు.

## ఏపిఎన్జీవో సంఘం దృష్టికి ప్రభుత్వవాహన డ్రైవర్ల సమస్యలు



చిత్తూరురూరల్, అక్టోబరు 25 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఏపి ఎన్జీవోల సంఘ అధ్యక్షులు విద్యాసాగర్‌ను శనివారం రాష్ట్ర ప్రభుత్వ సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పన్నీర్‌సెల్వం మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేసారు. ఈ సందర్భంగా డ్రైవర్ల ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, కొత్తవాహనాల కొనుగోలుకు ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పన్నీర్‌సెల్వంతో పాటు సభ్యులు నాగరాజ్, అన్నామలై, షణ్ముగం, బాలాజీ, ప్రసాద్, దేవకుమార్, రాఘవమరియువైద్యఆరోగ్యశాఖ,ఫారెస్టు, అగ్రికల్చర్, జుడిషియల్ డిపార్టుమెంట్ డ్రైవర్లు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరును కలిసిన సత్యసాయి సేవాసమితి

చిత్తూరురూరల్, అక్టోబరు 25 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, గిరింపేటలోని సత్యసాయి సేవాసదన్ సభ్యులు శనివారం జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం భగవాన్ శ్రీ సత్యసాయి శతవర్ష జన్మదినోత్సవ వేడుకలకు ఆయనను ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేసారు. కలెక్టరును కలిసిన వారిలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు ఎస్ మధుసూదనం, జిల్లా సమన్వయకర్తలు గజేంద్రరెడ్డి, దేవరాజులు, కన్వీనర్ ప్రభాకర్‌నాయుడు తదితరులు వున్నారు.

## కృత్రిమ మేధస్సుకు అధిక ప్రాధాన్యత

చిత్తూరురూరల్, అక్టోబరు 25 ప్రభాతవార్త:



భవిష్యత్తులో కృత్రిమ మేధస్సుకు అధిక ప్రాధాన్యత వుంటుందని, విద్యార్థులు ఆ దిశగా రాణించాలని ప్రముఖ సాంకేతిక విద్యానిపుణులు డామిట్టా శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని పివికెయన్ కళాశాల నందు ప్రథమ సంవత్సరం విద్యార్థులను ఆహ్వానిస్తూ ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి అధ్యక్షతన స్వాగత కార్యక్రమం ఏర్పాటుచేసారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న శ్రీధర్ మాట్లాడుతూ ఏఐ అన్నిరంగాల్లో వేగంగా దూసుకుపోతోందని, విద్యార్థులు విద్యా, పరిశోధన రంగాల్లో సైతం అనేక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను ఆయన విపులంగా నివృత్తి చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డా. నాగేంద్ర, ఐజెఎసి కోఆర్డినేటర్ డా. హరిప్రసాద్, పరీక్షల అధికారి డా. శరవణ, అకడమిక్ కోఆర్డినేటర్ డా.భానుప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరలో డాక్టర్ల పోస్టుల భర్తీ: డిసిహెచ్‌ఎస్ పద్మాంజ దేవి

సదుం అక్టోబర్ 25 ప్రభాతవార్త



త్వరలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని డాక్టర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు డిసిహెచ్ఎస్ పద్మాంజలీదేవి తెలిపారు. శనివారం ఆమె చదుములోని 50 పడకల వైద్యశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలంతా కలయితిరి గారు వార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. రోగుల పట్ల సహృదయంతో మెలగాలని ఆదేశించారు. వైద్యశాలకు వచ్చేవారి పట్ల తగిన సమాధానం చెప్పి వారిని సముదాయించాలన్నారు. అదేవిధంగా వైద్యశాలకు రోగులు వచ్చేందుకు చొరవ చూపాలన్నారు. డిప్యూటేషన్ పై వెళ్లిన సిబ్బందిని త్వరలో వైద్యశాలకు తిరిగి తెప్పిస్తామని చెప్పారు .ఈ సందర్భంగా డైట్ ను తనిఖీ చేశారు. రోగులకు సరిపడా డైట్ ను పెట్టాలని మంచి భోజనాన్ని అందజేయాలని ఆదేశించారు. డైట్ సక్రమంగా పెట్టకపోతే తొలగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరిడెంట్ రాజు వైద్యాధికారి పుష్పకుమారి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి కి ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరి

సదుం అక్టోబర్ 25 ప్రభాత వా ర్త



సదుం మండల కేంద్రంలోని స్థానిక ఎం జె పి గురుకుల పాఠశాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 515 సంవత్సరాల నిండి ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ పెండింగ్ ఉన్న విద్యార్థుల కోసం శనివారం ప్రత్యేకంగా ఆధార్ బయోమెట్రిక్ (వేలిముద్రలు ఐరిస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధార్ అప్డేట్ కోసం మండలంలోని దాదాపు అన్ని పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థుల హాజరై ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ దామోదర మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, విద్యార్థులు ఆన్లైన్లో ఎలాంటి పొరపాటు లేకుండా ఆధార్ బయో మెట్రిక్ అప్డేట్ తీసుకోవాలని, ఆధార్ కలిగివున్న ప్రతి పౌరుడు 10 సంవత్సరాలకు ఒకసారి ఆధార్ అప్డేషన్ కచ్చితంగా చేసుకోవాలని తెలియజేశారు.కార్యక్రమంలో ఎం జె పి కళాశాల ప్రిన్సిపల్ శ్రీని వాస రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజ, మండల పరిషత్ ఏ ఓ సుకన్య, బూరగమంద హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కరీముల్లా,సదుం పంచాయతీ సెక్రెటరీ సురేష్, వెల్ఫేర్ ఆఫీసర్ నటరాజ, మహిళా పోలీస్‌భార్గవి,లోహిత,సిఆర్‌పిఅంజమ్మ, డిజిటల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఆధార్ సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతిపురం తహశీల్దార్‌గా ప్రకాష్‌బాబు బాధ్యతలు

శాంతిపురం, అక్టోబర్ 25 ప్రభాతవార్త



శాంతిపురం మండల నూతన తహశీల్దార్‌గా ప్రకాష్‌బాబు శనివారం బాధ్యతలుచేపట్టారు.ఈయన ఇదివరకు కడ కార్యాలయంలో విధులునిర్వహించారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న శివయ్య బదిలీ అయ్యారు.శనివారం నూతన తహశీల్దార్ ప్రకాష్‌బాబును అధికార పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నేతలుజనార్ధనరెడ్డి, విశ్వనాథనాయుడు,మణి,సుగుణమ్మ, అనసూయ, చంద్రకళ, ఉయ్యాల జయరాంరెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

## ఆధార్ కార్డులో తప్పు, ఒప్పులను సరి చేసుకోండి

**సత్యవేడు, అక్టోబరు 25 ప్రభాతవార్త:**
సత్యవేడు మండలంలో అక్టోబరు 27వ తేదీ ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్టు స్థానిక మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థుల సౌకర్యార్థం సత్యవేడు పట్టణం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, మదనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపు సోమవారం జరుగుతుందన్నారు. ఆయా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఆధార్‌కార్డు లేని వారు కొత్తగా నమోదు చేసుకోవచ్చన్నారు. దీంతో పాటు ఆధార్ చిరునామా, పేరు మార్పు, తప్పొప్పులను సరి చేసుకునే అవకాశం ఉందన్నారు. అక్టోబరు 27 ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్‌క్యాంపు కొనసాగుతుందన్నారు.



## పుట్టల వద్ద నాగదేవతకు పూజలు

**సత్యవేడు,అక్టోబరు 25 ప్రభాతవార్త:** సత్యవేడు మండలంలో నాగుల చవితి పండుగను ప్రజలు ఘనంగా జరుపు కున్నారు. శనివారం నాగుల చవితిని పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున పుట్టల వద్ద నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి కోడిగుడ్లు, పాలు పోశారు. సత్యవేడు పట్టణంలోని బాల నాగాలమ్మ దేవాలయంలో భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్ట వద్ద పసుపు, కుంకుమ, గాజులు, నువ్వుల చిమ్మిలి ప్రసాదం నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. నాగుల చవితి సందర్భంగా బాల నాగాలమ్మ ప్రధాన పూజారి రేవతమ్మ ఆధ్వర్యంలో సభ్యులు సంతోష్, జయచంద్ర, మురళి, దాము, అజిత్, బాలాజీ, నాగ, కవి, ఎల్లయ్య, తులసి బృందం భక్తులకు అవసరమైన ఏర్పాట్లను చేశారు. కాగా ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో బాల నాగాలమ్మ దేవతను పట్టణ పుర వీధుల్లో ఊరేగించనున్నారు.

## పాఠశాలలను ఎంఈవో ఆకస్మిక తనిఖీ

**సత్యవేడు, అక్టోబరు 25 ప్రభాతవార్త:**



సత్యవేడు మండలంలో సీతారాంపేట, చెన్నేరి ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి రవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంఈవో రవి మొద టిగా చెన్నేరి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణంలో కొత్తగా నిర్మిస్తున్న నూతన తరగతి భవనాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు ధరణితో మాట్లాడి పని జాప్యం చేయొద్దు అన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సీతారాంపేట ప్రాథమిక పాఠశాలకు చేరుకున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థుల్లో ఆంగ్లభాష నైపుణ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఈ పాఠశాలలో నిర్మిస్తున్న తరగతి భవనాన్ని పరిశీలించి త్వరితగతిని పూర్తి చేయాలని సూచించారు.

## ఘనంగా ఎస్వీ డబ్ల్యు డిగ్రీ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం

**తిరుపతి విద్య, అక్టోబర్ 25 ప్రభాత వార్త:** శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ,పీజీ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరంలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థినులకు శనివారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా తిరుమల నారాయణమ్మ అధ్యక్షత వహించి ఆమె మాట్లాడుతూ ఈ కళాశాలలో సీటు పొందడం అదృష్టమని,పూర్వజన్మ సుకృతమని,విద్యార్థినిలకు అభినందనలు తెలిపారు.ఓరియంటేషన్ కార్యక్రమం వల్ల కళాశాలలోని హాస్టల్స్, లైబ్రరీ,ప్రొడక్టివిటీ కౌన్సిల్, ప్లేస్మెంట్ సెల్, స్కిల్ డెవలప్మెంట్ సెల్, రెడ్ క్రాస్,ఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి,స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మొదలైన వాటిని గురించి తెలుసుకొని సద్వినియోగ పరచుకోవాలన్నారు.డా ఎన్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థినులు కళాశాలలోని అన్ని సదుపాయాలను సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్చార్జ్ డా బి జ్యోతి,డా జి భద్రమణి, డా ఎ విద్యుల్లత,డా ఉమాదేవి,డా బి కృష్ణవేణి,డా సునీత,డా వసుధ,బి భారతి,డా వై జయశ్రీ,డా కస్తూరి,డా శోభ,డా శ్రీలత,డా విజయకుమారి,డా పద్మిని,డా శ్రీనివాసులు, డా డి లక్ష్మీదేవి,డా వి.లక్ష్మీదేవి,డా ప్రవీణ,డా లక్ష్మీ సంధ్య, అధ్యాపకులు,విద్యార్థినిలు పాల్గొన్నారు.



## ఎస్వీయూలో ఎన్.ఎస్.ఎస్ రక్తదాన శిబిరం

**తిరుపతి విద్య, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో శ్రీ సత్య సాయి 100 వ జయంతి సంవత్సరం సందర్భంగా ఎన్ఎస్ఎస్,సత్య సాయి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్వీయూ హెల్త్ సెంటర్ నందు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు లాంచనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు రక్తదానం చేయడం వలన అనేకమంది ప్రాణాలను కాపాడుతుందని, ముఖ్యంగా శాస్త్ర చికిత్సలు,ప్రమాదాలు, దీర్ఘకాలిక అనారోగ్యాల ఎదుర్కొంటున్న రోగులకు ప్రాణబిక్షల ఉపయోగపడుతుందన్నారు.రక్తదానం చేయడంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎల్లప్పుడూ ముందుంటారని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో దాదాపు 73 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు,సత్యసాయి ట్రస్ట్ వాలంటీర్లు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో దాతల నుంచి రక్తాన్ని స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ స్వీకరించింది.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ ఆచార్య దామోదరం,డా. పాకనాటి హరికృష్ణ, వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాస్ రెడ్డి, పి.ఓ.ఆచార్య శ్రీనివాస్ రెడ్డి,ఆచార్య వివేక్ రెడ్డి, పద్మావతి నగర్ వారి శ్రీ సత్య సాయి ట్రస్ట్ ప్రతినిధులు అమర్నాథ్, ఫణి,వర ప్రసాద్, రామ్మోహన్,చక్రవర్తి, కృష్ణ కుమార్, పార్థసారథి,స్విమ్స్ డాక్టర్లు ప్రవీణ్, జయశ్రీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## యంగ్ తరంగ్ లో ఎస్జిఎస్ఆర్ట్స్ కళాశాల విద్యార్థులుకు బహుమతులు



**తిరుపతి విద్య, అక్టోబర్ 25 ప్రభాత వార్త:** ఎస్వి యూనివర్సిటీ వారు నిర్వహించిన యంగ్‌తరంగ్ 2025 అంతర్ కళాశాలల పోటీలలో ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభను కనబరచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డా.బి సత్యనారాయణ తెలిపారు.ఎస్ వి యూనివర్సిటీ వారు ఈనెల 16 నుండి 18 వరకు మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించిన యంగ్ తరంగ్ 2025 అంతర్ కళాశాలల పోటీలలో తిరుపతిలోని 37 కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు.వారిలో ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు జానపద నృత్యం ట్రైబల్ డాన్స్ లో విశేషమైన ప్రతిభను కనబరచి రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.అలాగే పోటీలలో మూడవ రోజు జరిగిన క్రియేటివ్ కోరియోగ్రఫీ లో తృతీయ స్థానాన్ని సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రొఫెసర్.బి వి. మురళీధర్,రిజిస్ట్రార్ డా.భూపతి నాయుడు, సాంస్కృతిక విభాగాల కో ఆర్డినేటర్ పి .వివేక్ బహుమతులు అందజేశారు.విద్యార్థులు చక్కని ప్రతిభను ప్రదర్శించడానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన కళాశాల ఫైన్ ఆర్ట్స్ కన్వీనర్ డా.జే కొండలరావు కి, విద్యార్థుల వెన్నంటే ఉండి చక్కని ప్రోత్సాహన్ని అందించిన డా.ఎన్. వినోద్ కి, కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.సత్యనారాయణకి,ఈ. విజయభాస్కర్, భాస్కరన్,సులోచన రాణి, డా.కే, వెంకటేష్, కె.కోటేశ్వరయ్యకి ఇతర అధ్యాపక బృందానికి ధన్యవాదములు తెలియజేశారు.

## భారీ వర్షాల కారణంగా యువజన వారోత్సవాలు వాయిదా

**తిరుపతి క్రీడ, అక్టోబర్ 25, ప్రభాతవార్త** భారీ వర్షాల కారణంగా ఈ నెల 28వ తేదీ శ్రీ వివేకానంద జయంతి సందర్భంగా తిరుపతి ఎమరాల్డ్ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు యువజన వారోత్సవాలు వాతావరణ పరిస్థితుల వలన వాయిదా వేయడం జరిగిందని సెట్విన్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి డా. పి. యశ్వంత్ తెలిపారు. అందువల్ల తిరుపతి జిల్లా నందు యువతీ యువకులకు, కళాకారులకు ఈ విషయాన్ని గమనించాలని, నవంబర్ మొదటి వారంలో జిల్లా స్థాయి యువజనోత్సవం నిర్వహించబడునని సెట్విన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డా. పి. యశ్వంత్ తెలిపారు.

## ఎక్సైజ్ సురక్ష యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి: ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త రాష్ట్రంలో నకిలీ మద్యంను అరికట్టుటకు నిర్మూలనకు ప్రభుత్వం రూపొందించిన 'ఎక్సైజ్ సురక్ష యాప్‌ను' ప్రజలకు అర్థమయ్యేటట్లు ప్రచారం చేయాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం పానగల్‌లోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వద్ద నకిలీ మద్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు.ప్రభుత్వం ఎన్నో పరిశీలనలు ప్రతిపక్షం విమర్శలు,ఆరోపణల దృష్ట్యా ప్రత్యేక యాప్‌ను రూపొందించిందన్నారు.ఈ యాప్‌ను శనివారం ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి ప్రారంభించారు.తమ పరిధిలో తాము ప్రచారం చేస్తున్నామని అలాగే ఎక్సైజ్ శాఖ విస్తృతంగా గ్రామ గ్రామానికి వెళ్ళి ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యభద్రత ప్రధమ కర్తవ్యంగా భావిస్తుందన్నారు.అందుకే ప్రత్యేక యాప్‌ను రూపొందించిందన్నారు.నకిలీ మద్యం వ్యాపారులపై ఉక్కుపాదం మోపడానికి ఈ యాప్ శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుందని ఎంఎల్ఏ వివరించారు.దీనిని ప్రతిఒక్క మద్యం వినియోగదారుడు ఉపయోగించుకునేటట్లు చూడాలని ఎంఎల్ఏ సూచించారు.ఈ కార్యక్రమాల్లో ఎంఎల్ఏతో పాటు మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, విజయకుమార్,కాసరం రమేష్,పేట బాలాజి, బషీర్,పోలూరు శ్రీనివాసులు రెడ్డి,కన్నల ప్రతాప్‌రెడ్డి,మునిరాజాయాదవ్,సుబ్రమణ్యం రెడ్డి,డిపిఇఓ నాగమల్లేశ్వరరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి స్థానిక సిఐ లావణ్య వారి సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్టల వద్ద పూజలు

**కేవీబీ పురం, అక్టోబరు 25 ప్రభాతవార్త:**
కేవీబీ పురం మండలంలో నాగుల చవితి పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. శనివారం నాగుల చవితిని పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున పుట్టల వద్ద నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి కోడిగుడ్లు, పాలు పోశారు. ఈ నేపథ్యంలోనే నాగుల చవితిని పురస్కరించుకుని మండలంలోని ప్రతి గ్రామంలో, దేవాలయాల్లో ఉన్న పుట్టల వద్ద, ఊరి బయట ఉన్న పాము పుట్టల వద్దకు భక్తులు ఉదయం నుంచే చేరుకుని నాగదేవతకు పూజలు నిర్వహించారు. నాగదేవతలకు పూజలు చేస్తే అనర్థాలు ఉన్నటువంటి నాగదోషాలు ఉన్నవారికి సంతానం లేని వారికి భాగ్యం కల్పిస్తుందని తెలిపారు.

## ముడియూరు విద్యుత్ సబ్ స్టేషన్‌కు టెండర్లు పిలవండి



**పిచ్చాటూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త** పిచ్చాటూరు మండలం ముడియూరులో ప్రభుత్వం మంజూరు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్‌కు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విద్యుత్ శాఖ సీఎండీ శివశంకర్(ఐఏఎస్)ను కోరారు. శనివారం తిరుపతిలోని ఏపీ ఎస్పీడిసీఎల్ సీఎండీ కార్యాలయానికి ఎమ్మెల్యే ఆదిమూలం చేరుకుని సీఎండీ శివశంకర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యవేడు మండలం చమర్తి కండ్రిగలో చివరి దశ నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ను త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని ఆయన కోరారు. అలాగే సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాలకు సంబంధించిన విద్యుత్ సమస్యలను, రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే, సిఎండికి విజ్ఞప్తి చేశారు. తన వినతులకు విద్యుత్ శాఖ సీఎండీ శివశంకర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడించారు.

## వాడవాడలా నాగుల చవితి వేడుకలు

**పుత్తూరు రూరల్, అక్టోబరు 25 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో శనివారం చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నాగులపుట్టకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే రైల్వే కొటర్స్ సమీపంలో ఉన్న శ్రీ నాగాలమ్మ దేవాలయం శనివారం నాగుల చవితి సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉదయం ఆలయ ఆవరణలో గణపతి హోమం, నవగ్రహ శాంతి, నవగ్రహ హోమం, లక్ష్మిపూజ, అలాగే మూలస్థానం విగ్రహాలకు వినాయక స్వామికి శ్రీ మానసాదేవికి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి నాగాలమ్మకు హోమం అనంతరం అభిషేకలు, అలంకరణలు చేశారు.

## తిరుచ్చి వాహనంపై "శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న"



**చంద్రగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంక టేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శన మిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైం కర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభర ణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

## బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరఫీ, బిఎస్సి అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కోర్సులకు

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**
స్విమ్స్ యూనివర్సిటీలో ఈ నెల 30న శ్రీ పద్మావతి మహిళా మెడికల్ కాలేజీ, స్విమ్స్ ప్రాంగణంలో బిపిటిలో బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరఫీ నాలుగు సీట్లు ఓసి (1), ఎస్టి (1), ఓసి (1), ఎస్సి (1), అల్లైడ్ హెల్త్ సైన్సెస్ ఒక సీటు ఎస్సి గ్రూప్ 3-(1) కోర్సులకు మిగిలిన ఖాళీలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ తెలిపారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లు, పూర్తి ఫీజుతో హాజరు కావాలని, ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే రిజర్వేషన్ జరపాలని తెలిపారు. కౌన్సిలింగ్‌కు ఇంతకు మునుపు దరఖాస్తు చేయని వారు అర్హులు కాదన్నారు. మరిన్ని వివరాల కొరకు స్విమ్స్ వెబ్సైట్‌ను తప్పక సందర్శించాలన్నారు.

## వైభవంగా నాగుల చవితి వేడుకలో భక్తులు



**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 25 ప్రభాతవార్త:**
హిందువుల పండుగల్లో ఎంతో ప్రాముఖ్యత కలిగిన పండుగ నాగుల చవితి. నాగుల చవితి పండుగను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు నోములు నోచి ఉపవాసాలు, మొక్కులు చెల్లించుకుని భక్తిశ్రద్ధలతో వైభంగా నాగుల చవితి పూజలను సమీపంలోనఇ నాగుల పుట్టలు వద్ద, దేవాలయాల్లో నాగుల చవితి వేడుకలను జరుపుకోవడం జరిగింది. ఈ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉండడంతో ప్రజలు కుటుంబ సభ్యులతో సహ నోములు నిర్వహించారు. నాగ దోషానికి సంబంధించి ఈ పూజ నిర్వహిస్తే మంచి ఫలితం వస్తుందని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. వాడవాడలా ప్రజలు నాగుల చవితి ఘనంగా జరుపుకోవడం జరిగింది.

## రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం:



**తొట్టంబేడు,అక్టోబర్ 25 ప్రభాతవార్త** రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమా లను శని వారం ఐసిడియస్ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ ఉద్యోగుల సంఘాధ్యక్షురాలు శ్రీకాళహస్తి సిడి పిఓ శాంతి దుర్గ నిర్వహించారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చుకునే విధంగా కార్యచరణ చేపడతామని వివరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో డిఏ గురించి అలాగే బాకాయి ఉన్న డిఏల గురించి భోజన విరామ సమయంలో నిర్వహించారు. ఇక పిఆర్‌సి అరియర్స్,రావాల్సిన బకాయిలను వవెంటనే చెల్లించి ఉద్యోగుల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని ఆమె కోరారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ప్రభుత్వానికి పంపిన వినతులు,వీడియోలను ప్రదర్శించటం జరిగింది, శాంతి దుర్గ, కార్యదర్శులు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## భారీ వర్షంతో కాజ్‌వేలపై ఉధృతంగా వర్షపు నీరు ప్రవాహం..!

### పలు గ్రామాల మధ్య ఆగిన రాకపోకలు



**నారాయణవనం, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో అరుణానది ఉధృతంగా ప్రవహిస్తున్నది. కొద్దిరోజులుగా వర్షం కురుస్తున్నప్పటికి అరుణానది, చెరువులకు అంతంత మాత్రంగా నీళ్ల చేరింది. అయితే నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో మండలంలోని అరుణానది బ్రిడ్జిలపై నీళ్ల ప్రవహించింది. తిరువట్యం ప్రాజెక్టు ఎప్పుడో నిండిపోయింది. అలాగే కీళగరం, ఎరికంబట్టు, కళ్యాణపురం, భీముని చెరువు, నక్కలచెరువు, వెత్తలతడుకు, జిఎన్‌కండ్రిగ, తుంబూరు, పాలమంగళం, నైనారుకండ్రిగ చెరువులకు నీళ్ల చేరి నిండడంతో రైతుల్లో కళ్లలో ఆనందం వెల్లు విరుస్తున్నది. ఇకపోతే తిరువట్యం బ్రిడ్జి, నారాయణవనం బ్రిడ్జి, సముదాయం అవనాక్షమ్మ గుడి బ్రిడ్జి, తుంబూరు, పాలమంగళం బ్రిడ్జిపై నీళ్ల ప్రవహించడంతో నాలుగురోజులుగా రాకపోకలు ఆగిపోయింది. కొంతమంది మాత్రం సాహసం చేసి దాటుకున్నారు. వాహనాలు,చాలామందివ్యాపారస్తులు,సామాన్యప్రజలెవ్వరుగ్రామాలనువిడిచి బయటకు రాలేదు.

## భక్తి శ్రద్ధలతో నాగులచవితి వేడుకలు

**నారాయణవనం, అక్టోబర్ 25 ప్రభాతవార్త :**



మండలంలో శనివారం నాగులచవితి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలకేంద్రంలోని నారాయణవనం తామరగుంట, కీళగరం చెరువు, చిదామిల్ ఎదురుగా, తుంబూరు, అరణ్యం కండ్రిగ, కైలాసనాథకోన, పాలమంగళం, నైనారు కండ్రిగ గ్రామాల్లో వున్న నాగాలమ్మ అమ్మవారి ఆల యాల వద్దకు మహిళా భక్తులు వందల సంఖ్యలో తరలివెళ్లి పూజలను చేశారు. అమ్మవారిని పాలు, పెరు గు, నెయ్యి, కొబ్బరినీరు, పన్నీరు వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసిన తర్వాత పసుపు, కుంకుమ, పుష్పాలతో అలంకరించారు. మొక్కుబడి కలిగిన భక్తులు పాలు, కోడిగ్రుడ్డులు, సజ్జలు, బెల్లం, నిప్పట్లను సమర్పించుకున్నారు. అనంతరం హారతులు పట్టారు.

## చంద్రగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సురేష్ కుమార్

**చంద్రగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**



చంద్రగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.సురేష్‌కుమార్‌ను నియమిస్తూ తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులిచ్చారు. ఆ మేరకు శుక్రవారం సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ సుబ్బరామిరెడ్డి తిరుపతి ట్రాఫిక్‌కు బదిలీపై వెళ్ళారు. అయితే ఆయన స్థానం భాకరాపేట సిఐ ఇమ్రాన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించారు. గతంలో సురేష్‌కుమార్ తిరుపతిలో రెడ్‌శాండిల్ టాస్క్‌ఫోర్స్ సిఐగా విధులు నిర్వహించారు. గతంలో సురేష్‌కుమార్ ఇక్కడ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన అనుభవం సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ దోహదపడగలదని భావిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రజలతో పోలీసులు సత్సంబంధాలను కొనసాగించడం, ప్రజల సహకారంతో శాంతి భద్రతలను పరిరక్షణ, ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, సరఫరా వంటి అసాంఘిక చర్యలను అణచివేయడంలో ఎటువంటి ఉపేక్ష వుండదని తేల్చిచెప్పారు. ఈ క్రమంలో ఎస్ఐలు అనిత, రవీంద్రనాక్, సిబ్బంది, పలువురు నాయకులు, ప్రముఖులు ఆయనను మర్యాద పూర్వకంగా కలసి ఆయన రాకను స్వాగతించారు.

## వంతెనల వద్ద పూడికలు తీయించిన ఎంఎల్ఏ



**ఎంఎల్ఏ పులివర్తి నాని**
**చంద్రగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**
ఉపరితల ఆవర్తనంతో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు వరదనీటితో పోటెత్తుతుండటంతో ఎం ఎల్ఏ పులివర్తి నాని ప్రమాదకర ప్రదేశాలలో పూడి కలు తీయించే పనులు చేపట్టారు. మండల పరిధి లోని నడింపల్లి, పులిత్తివారిపల్లి వద్ద గల బ్రిడ్జిని, కల్వర్టును శనివారం ఎంఎల్ఏ పరిశీలించారు. నడింపల్లి బ్రిడ్జి ప్రమాకర స్థితిలోకి జారుకుంటుదంతో వరదనీటి ప్రవాహానికి ఎటువంటి అటంకం లేకుండా జెసిబిలను వినియోగించి జంగిల్ క్లీనింగ్, పూడికలు తీయించారు. అదేవిధంగా వరదనీటి ఉధృతికి కట్ట కోతకు గురికాకుండా ఇసుక బస్తాలతో కట్టడి చేశారు. పులిత్తివారిపల్లి వద్ద వరదనీటి ప్రవాహానికి పూడికలు తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే 24 గంటలు భారీ నుండి అతిభారీ వరాక్షలు కురిసే అవకాశం వుందన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో వుండాలనీ, ఎటువంటి అవాంఛనీయ ప్రమాద సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. గత అసెంబ్లీ సమావేశాలలో శిధిలావస్థకు చేరుకున్న నదులపై కొత్త బ్రిడ్జిల నిర్మాణం కొరకు రూ.14.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేయడం జరిగిందన్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బి మంత్రి జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా, ఎంపిటిసి ఏసి శేఖర్, ఆర్‌అండ్‌బా డిఈ శ్రీనివాసులు, ఏఈ అజిత్‌కుమార్ రెడ్డి, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఇన్‌చార్జ్ ఎంపిడిఓ వెంకటరత్నం, టిడిపి నాయకులు దొమ్మలపాటి సతీష్‌కుమార్ నాయుడు, మేడసాని కుమార్, బెల్లంకొండ రమేష్ రాయల్, చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలను పట్టుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**తిరుపతిరూరల్, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం తనపల్లిలో గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్ ట్రాన్‌పార్మర్ పట్టుకుని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ స్తంభానికి మృతదేహం వేలాడుతూ కనిపించడంతో స్థానికులు షాక్ గురయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి ప్రాంతంలో తనపల్లి రహదారి పక్కన ఉన్న ట్రాన్‌పార్మర్‌కు వేలాడుతున్న వ్యక్తిని గుర్తించి, తిరుచానూరు పోలీసులకు సమాచారం అందించారు. ప్రాథమిక సమాచారం మేరకు గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్ తీగలు పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయాకు తరలించారు. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి, ధర్యాప్తు చేస్తున్నారు.

## గ్రామస్థాయిలో కార్యకర్తలకు పెద్ద పీట: భవిష్యత్తు యువతదే



**శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 25 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకరవర్గంలో గ్రామస్థాయి కార్యకర్తలకు పెద్ద పీట ఉంటుందని, భవిష్యత్తు యువతదే అని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు. ఏర్పేడు మండల కేంద్రంలో పార్టీ కార్యాలయానికి మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు శ్రీకారం చుట్టారు.ఈ కార్యాలయాన్ని శనివారం సుధీర్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ పార్టీకి యువతే ప్రాణం అన్నారు. రాబోవు రోజుల్లో యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రశాంత వాతావరణం ఉంటుందన్నారు.గ్రామాల్లో శాంతి యుత వాతావరణం ఉంటుందని దానిని ప్రతి ఒక్కరు కాపాడాలని సుధీర్‌రెడ్డి యువతకు పిలుపు నిచ్చారు. ఏర్పేడు మండలం అంటే తన తండ్రి హయాం నుంచి తమకు గుర్తింపు అన్నారు.అందుకే విమానాశ్రయం,కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలతో పాటు పారిశ్రామికంగా గుర్తింపు ఇచ్చామన్నారు.నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని సుధీర్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు,మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులునాయుడు, మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ చెంచయ్యనాయుడు,మండల నాయకులు శివశంకర్‌రెడ్డి, రెడ్డి వారి గురువారరెడ్డి,మోహన్ నాయుడు, మనోహర్‌నాయుడు కేశినేని సుబ్రమణ్యం,గుణా యాదవ్, కృష్ణవేణి తదితరులుపాల్గొన్నారు.

## కోలా విశాలాక్షిని సత్కరించిన యువకులు

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలిలో సభ్యురాలిగా నియమించబడిన కోలా విశాలాక్షిని శనివారం శ్రీకాళహస్తిలోని ఓ కళ్యాణ మండపంలో యువకులు ఘనంగా సత్కరించారు. ఆమెతో పాటు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ హాజరయ్యారు.శ్రీకాళహస్తీశ్వరాలయం పాలక మండలిలో బిజెపికి పని చేసిన వారికి అవకాశం కల్పించటం అభినందనీయం. కోలా అభిమానులు సత్కరించి జ్ఞాపికను అందించారు. శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఎన్‌డిఏ కూటమి నాయకులు, బిజెపి యువ నాయకులు, మహిళా మోర్చా సభ్యులు పాల్గొన్నారు.



## శివయ్య సేవలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ ఇన్‌చార్జి శశిధర్ కుటుంబసభ్యులో హాజరయ్యారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు.ఆయన కుటుంబసభ్యులతో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు. ఎఇఒ మోహన్ ఎపిఆర్ఓ రవి, ఇన్స్పెక్టర్ వెంకటస్వామిలు ప్రత్యేక రాహుకేతుదోష నివారణ మండపంలో ఏర్పాటుచేసారు.పూజలఅమ్మవారిఅంతరాలయదర్శనంఏర్పాట్లు చేసారు. తరువాత వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

**శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 25 ప్రభాతవార్త** ఏర్పేడు మండలం గుడిమల్లంలో పనిచేయుటకు ఉద్యోగులు కావాలని అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఇఒ రామచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరశురామేశ్వరాలయాన్ని పరిపాలనా పరంగా పటిష్టం చేయటానికి చర్యలు తీసుకుంటున్నామని ఇఒ వివరించారు.ఈనేపథ్యంలో ఆలయంలో పని చేయటానికి ఒక పరిచారకుడు కావాలని సంభావన ప్రాతిపదికగా నియమించబడుతుందని ఆయన వివరించారు.అలాగే కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఔట్ సోర్సింగ్‌లో పని చేయుటకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అర్హులైన వారు నవంబర్ నెల 5 తేది లోపల గుడిమల్లంలోని ఆలయ ఇఒను సంప్రదించాలని కోరారు.

## గుడిమల్లంకు ప్రత్యేక బస్సు

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త** కార్తీక సోమవారాల్లో స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాలతో శ్రీకాళహస్తి నుంచి గుడిమల్లంకు ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు డిపోమేనేజర్ రేవతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ బస్సు ఉదయం 5గంటలకు శ్రీకాళహస్తి బస్టాండు నుంచి బయలు దేరి గుడిమల్లం,అప్పలాయగుంట, వకుళ మాత దేవాలయం,ముక్కోటి,తలకోనకు వెళ్ళి తిరిగి సాయంత్రం ఐదుగంటలకు శ్రీకాళహస్తి చేరుతుందని వివరించారు. రాను పోను రూ.450లు మాత్రమే అన్నారు. ఒకే రోజు 5 ప్రసిద్ది దేవాలయాలు దర్శించుకోవటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో 'దీపారాధన' చేసుకునే అవకాశం కల్పించినట్లు వివరించారు.ఈ సదవకాశాన్ని శివభక్తులతో పాటు ప్రయాణీకులు ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు.


**పంజాబ్ నేషనల్ బ్యాంక్**
(భారత ప్రభుత్వ రంగ సంస్థ) ...విశ్వాసానికి మరోపేరు

**అసెట్ రికవరీ మోనిటరింగ్ బ్రాంచ్ : విశాఖపట్నం**
**డి.నెం.9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎమ్‌వీఆర్ వినాయగర్ సెంటర్, విఐపి రోడ్, విశాఖపట్నం-530003.**

**ఉద్దేశించిన అమ్మకం నోటీసు**

22-10-2025

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి నిబంధన 8(6) క్రింద**

1) **మెస్సర్స్ శ్రీ లక్ష్మీ ఫుడ్స్, ప్రాతినిధ్యం వహించు ప్రొప్రయిటర్: శ్రీ ఎం.వి.జ్ఞాన శేఖర్, తండ్రి:** వెంకటేశ్వర్లు, ఇంటి నెం.1-150-3, బంగారు మిట్ట, తిరుపతి-517507.
2) **శ్రీ ఎం.వి.జ్ఞాన శేఖర్ (ప్రొప్రయిటర్),** తండ్రి: వెంకటేశ్వర్లు, నివాసం: డి.నెం.4-4-929ఎ, నెహ్రూ నగర్, తిరుపతి-517501
**మరియొక చిరునామా: శ్రీ ఎం.వి.జ్ఞాన శేఖర్ (ప్రొప్రయిటర్),** తండ్రి: వెంకటేశ్వర్లు, ఫ్లాట్ నెం.205, ప్రైమ్ అవెన్యూ, పాస్‌పోర్ట్ ఆఫీస్ పైన, ఎయిర్ బైపాస్ రోడ్, తిరుపతి-517507
3) **శ్రీ ఇందుశేఖర్ కె (హామీదారు / తనఖాదారు),** తండ్రి: కె.మోహన్ నాయుడు (లేటు), నివాసం: డి.నెం. 19-7-99, డి4, శ్రీవారి అపార్ట్‌మెంట్స్, ఆర్‌సి రోడ్, తిరుపతి-517501
**విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి నిబంధన 8(6) క్రింద చదువబడు SARFAESI చట్టం, 2002 లోని సెక్షన్ 13(4) & 13(8) కింద సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకపు నోటీసు**
**రిఫరెన్స్: లోన్ ఖాతా నెం.లు: 4198008700000685**
**పంజాబ్ నేషనల్ బ్యాంక్, సర్కిల్ శాస్త్ర సెంటర్, విజయవాడ** వారు **తేది.21.09.2024**న జారీ చేసిన నాటి నోటీసును చూడండి. సెక్షన్ 13(2) క్రింద సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002, మరియు కింద సంతకం చేసిన వ్యక్తి **తేది.19-02-2025**న క్రింద పేర్కొన్న సెక్యూర్డ్ ఆస్తులను **లాంఛనాత్మక స్వాధీనం** చేసుకుంటూ **తేది.19-02-2025**న జారీ చేసిన స్వాధీన నోటీసును కూడా చూడండి.
ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై నదరు చట్టంలోని సెక్షన్ 13(8) లోని నిబంధనలు గమనించగలరు.

**స్థిరాస్తి వివరములు**

**1) తేది.23.05.2005 నాటి అమ్మకపు దస్తావేజు నెం.3698/2005 ప్రకారం శ్రీ ఇందుశేఖర్ కె, తండ్రి: మోహన్ నాయుడు (లేటు) గారి పేరున గలదు:**
చిత్తూరు, తిరుపతి రూరల్, అవిలాల, బంగారుమిట్ట, సర్వే నెం.20/బి2/2సి, సమీప ఉత్తరం వైపు గల డోర్ నెం.1-150, ప్లాట్ నెం.12 లోని 198.00 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న నివాస భూమి (ఆమోదించబడిన లేఅవుట్ డి.డిన్ నెం.6/బి1/91 తేదీ 28-03-1991)నకు **హద్దులు: తూర్పు:** వారణాసి ఇందిరమ్మ గారి స్థలం, **పడమర:** కోయకుండ ఫిదా హుస్సేన్ గారి స్థలం, **ఉత్తరం:** 33 అడుగుల రోడ్డు, **దక్షిణం:** కె.నరస్వతమ్మ గారి భూమి, **తూర్పు నుండి పడమర:** 33 అడుగులు, **ఉత్తరం నుండి దక్షిణం:** 54 అడుగులు. 1782 చదరపు అడుగులు లేదా 198.00 చదరపు గజాల విస్తీర్ణంలో గల ఖాళీ స్థలం.

**2) తేది.17.07.2008 నాటి అమ్మకపు దస్తావేజు నెం.2754/2008 ప్రకారం శ్రీ ఇందుశేఖర్ కె, తండ్రి: మోహన్ నాయుడు (లేటు) గారి పేరున గలదు:**
చిత్తూరు, తిరుపతి రూరల్, అవిలాల, బంగారుమిట్ట, సర్వే నెం.20/బి2/సి, సమీప ఉత్తరం వైపు గల డోర్ నెం.1-150, ప్లాట్ నెం.9 లోని 201.66 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న నివాస భూమి (ఆమోదించబడిన లేఅవుట్ డి.డిన్ నెం.6/బి1/90) నకు **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.10, **పడమర:** శ్రీ సున్నపు మునిరెడ్డి గారికి చెందిన ప్లాట్ నెం.8, **ఉత్తరం:** 33 అడుగుల రోడ్డు, **దక్షిణం:** 33 అడుగుల రోడ్డు మధ్యలో, **తూర్పు నుండి పడమర:** 33 అడుగులు, **ఉత్తరం నుండి దక్షిణం:** 55 అడుగులు. 1815 చదరపు అడుగులు లేదా 201.66 చదరపు గజాల విస్తీర్ణంలో గల ఖాళీ స్థలం.

**3) తేది.15.10.2014 నాటి రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజు నెం.4239/2014 ప్రకారం శ్రీ ఇందుశేఖర్ కె, తండ్రి: మోహన్ నాయుడు (లేటు) గారి పేరున గలదు:**
చిత్తూరు జిల్లా, తిరుపతి రూరల్ సబ్-డివిజన్, శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా, నేషనల్ హైవే బైపాస్ రోడ్డు విస్తరణ కోసం ప్లాట్ నెం.14 మరియు ప్లాట్ నెం.11లో 200 అడుగుల స్థలం వదిలిపెట్టిన తర్వాత, రెవెన్యూ అధికారులచే ఉప-విభజన తర్వాత సర్వే నంబర్ 20/బి2సి2గా మిగిలిన దక్షిణ భాగంలో ఉన్న ప్లాట్ నెం.11, తిరుపతి రూరల్ మండల్ నెం.49, రాజీవ్ నగర్ ఏరియా, అవిలాల ఏరియాలో సర్వే నంబర్ 20/బి2తో, ఉప-విభజన సర్వే నంబర్ 20/బి2సి తర్వాత, తుడా (తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఆమోదించిన డి.డిన్ ఎల్.పి నెం. 25/బి1/1994, తేది 08.05.1997తో కూడిన రెసిడెన్షియల్ ఖాళీ స్థలం యావదాస్తి
**హద్దులు: తూర్పు:** 33 అడుగుల వెడల్పు రహదారి, **పడమర:** ప్లాట్ నెం.12, **ఉత్తరం:** స్వాధీనం తర్వాత మిగిలిన 200 అడుగుల ప్లాట్ నెం.11 ఉత్తర భాగం, **దక్షిణం:** 33 అడుగుల వెడల్పు రహదారి. ఈ హద్దులలో ఉత్తరం నుండి దక్షిణం వైపు తూర్పు వైపుగా 18 అడుగులు 5.490 మీటర్లు, తూర్పు నుండి దక్షిణం వైపు పడమర వైపుగా 21 1/2 అడుగులు 6.557 మీటర్లు.
ఈ నరిహద్దులలో 1187.47 చదరపు అడుగులు లేదా 131.94 చదరపు గజాలు లేదా 32.98 అంకణాల ఖాళీ స్థలం.

దీనికి సంబంధించి, మీరు ఇందుమూలంగా **తేది.31.12.2024 నాటికి రూ.1,16,96,720.12 పై. (అక్షరాల ఒక కోటి పదహారు లక్షల తొంభై ఆరు వేల ఏడు వందల ఇరవై రూపాయల పన్నెండు పైసలు మాత్రమే)** బకాయిలను చెల్లించవలసిందిగా కోరబడుతున్నాము. పైన పేర్కొన్న నోటీసులలో పేర్కొన్న విధంగా మరిన్ని వడ్డీ, ఖర్చులు మరియు ఖర్చులతో పాటు, పైన పేర్కొన్న నోటీసులలో పేర్కొన్నట్లుగా తాజా ఒప్పంద వడ్డీ మరియు పేర్కొన్న ఆస్తులను స్వాధీనం చేసుకునేటప్పుడు కింద సంతకం చేసిన వ్యక్తి చేసిన ఖర్చులు మరియు ఆ తర్వాత వాటిని సంరక్షించడానికి, ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజులలోపు చెల్లించి, కింద సంతకం చేసిన వ్యక్తి నుండి పైన పేర్కొన్న ఆస్తులను విడుదల చేసుకోవాలి. మీరు పేర్కొన్న వ్యవధిలోపు పైన పేర్కొన్న మొత్తాలను చెల్లించకపోతే, కింద సంతకం చేసిన వ్యక్తి SARFAESI చట్టం కింద అనుమతించబడిన ఏ విధంగానైనా బకాయిలను వసూలు చేయడానికి పైన పేర్కొన్న ఆస్తులను విక్రయించవలసి ఉంటుంది మరియు పైన పేర్కొన్న చట్టం మరియు నియమాల ప్రకారం తగినట్లుగా పరిగణించబడే ఇతర చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

**తేది : 22-10-2025** సం/- అధీకృత అధికారి
**ప్రదేశం: విజయవాడ** పంజాబ్ నేషనల్ బ్యాంక్

# గూడూరు డివిజన్

## కల్తీ మద్యం నివారణకే సురక్ష యాప్ : ఎమ్మెల్యే పాశిం



గూడూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త: కల్తీ మద్యాన్ని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సురక్ష యాప్‌ను తీసుకువచ్చిందని, మద్యం దుకాణాల వద్ద కొనుగోలుదారులు మద్యాన్ని కొనుగోలు చేసినప్పుడు యాప్ ద్వారా మద్యం ఒరిజినలా లేక కల్తీనా అని తెలుసుకోవచ్చని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్ ప్రాంతంలో ఉన్న మద్యం దుకాణం వద్ద ఆయనతో పాటు అధికారులు యాప్‌పై అవగాహన కలిగించారు. స్థానిక బాలాజీ నగర్ సెంటర్ సమీపంలో ఉన్న మద్యం దుకాణం వద్ద ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, ఎక్సైజ్ అధికారులు సురక్ష యాప్ ద్వారా మద్యాన్ని తనిఖీ చేసి మద్యం కొనుగోలు చేసే వారికి యాప్ గురించి అవగాహన కల్పించారు. వైకాపా నాయకులు చేస్తున్న మద్యం వ్యాపారాన్ని టిడిపి నాయకులు చేస్తున్నారని ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని వెల్లడించారు. నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌రాజు,సోమిశెట్టిచెంచురామయ్య,శివకుమార్,పెంచలయ్య,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తీరప్రాంత భద్రతపై అవగాహన సదస్సు



కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త: తీరప్రాంతంలో మత్స్యకారులు తుపాను సమయంలో అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సిఐ వెంకటేశ్వర్లురెడ్డి కోరారు. శనివారం కోట మండలం శ్రీనివాసనత్తంలో మత్స్య కారులకు తీరప్రాంత భద్రతపై అవగాహన కల్పించారు. తుఫాను సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై వివరించారు. సురక్షితమైన భవనాల్లో ఉండాలని సూచించారు. సముద్రంలోకి ఎవరూ వేటకు వెళ్లకూడదని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు చెందిన అనుమా నితులు వస్తే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మెరైన్ ఎస్ఐ శివసామ్య, ఫారెస్ట్ అధికారి గాయం శ్రీనివాసులు, మత్స్యశాఖ అధికారి రవి, పంచాయతీ కార్యదర్శి రామమ్మ, వీఆర్ఓ శ్రీనివాసులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

## వాడవాడలా నాగులచవితి వేడుకలు

కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త: నాగుల చవితి పురస్కరించుకుని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శనివారం విద్యానగర్, కోట, జరుగుమల్లి, కొత్తపాలెం, అల్లంపాడు, కొత్తపల్లం, కర్లపూడి, కేశవరం, చిట్టేడు, గూడలి తదితర గ్రామాల్లో మహిళలు పుట్టలకు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా శివాలయాల్లో భక్తులు పోటెత్తారు.

## హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపిడిఓ

కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త: కోట మండలం చిట్టేడులోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. హాస్టల్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం అక్కడి నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు.

## ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన ర్యాలీ




సూళ్లూరుపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త: పట్టణంలోని నవజీవన్ ఆర్గనైజేషన్ సిసిపియు ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ విక్రమ్ డిగ్రీకాలేజీలో విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, ఎఎన్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణను అడ్డుకుంటాం : ఎంపిపి అల్లూరు

సూళ్లూరుపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని అడ్డుకుంటామని ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం వైసీపీ కార్యాలయంలో ప్రజా ఉద్యమం పేరుతో ముద్రించిన పోస్టర్లను పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచనలతో ప్రజా ఉద్యమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 28వ తేదీన సూళ్లూరుపేట పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, చిన్ని సత్యనారాయణ, మీజూరు రామకృష్ణారెడ్డి, అయితా శ్రీధర్, కర్లపూడి సురేష్, తుపాకుల ప్రసాద్, భగవాన్‌దాస్, బద్దెపూడి మోహన్‌రెడ్డి, వాసు మొదలియార్, బాబురెడ్డి, హుస్సేన్, సురేంద్ర, చిన్నిరాజా, మల్లి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు

బాలాయపల్లి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: మండలంలో వాడవాడలా నాగుల చవితి సందర్భంగా నాగుల చవితి వేడుకలు మహిళా భక్తులు ఘనంగా జరుపుకున్నారు. నాగేంద్రుని పుట్టను శుద్ధి చేసి పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పుట్టలో పాలు పోసి, కోడిగుడ్లను నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి నాగేంద్రునికి పూలు, పండ్లు సమర్పించారు. బాలాయపల్లి మండలం వెంగమాంబాపురం, యాచవరం, బాలాయపల్లి ఇంకా పలు గ్రామాలలో అత్యంత భక్తి శ్రద్ధలతో నాగుల చవితి పర్వదినాన్ని మహిళా భక్తులు జరుపుకున్నారు. నోములు నోచుకొని పుట్ట చుట్టూ నోము దారాలను చుట్టి ప్రదక్షిణాలు చేశారు.

## చెడిన విద్యుత్ మోటర్‌ను బాగు చేయండి

వెంకటగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: పట్టణంలోని 14వ వార్డు సాయిబాబా గుడి వద్ద చెడిన తాగునీటి విద్యుత్ మోటార్‌ను బాగు చేయాలని కమిషనర్ వెంకటరామిరెడ్డికి కౌన్సిలర్ శంకరయ్య వినతి పత్రం అందజేశారు. చెడిన విద్యుత్ మోటర్‌ను చేశారని పైపులు తక్కువగా ఉన్నందున నీరు రాలేదని తెలిపారు. వెంటనే మోటర్‌ను బాగు చేసి నీరు ఇవ్వాలని కోరారు. తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకట్రామిరెడ్డి కౌన్సిలర్‌కు తెలిపారు.

## 10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



బాలాయపల్లి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: మండలంలోని అలిమిలి అటవీ ప్రాంతంలో 10 ఎర్రచందనం దుంగలను డిఆర్‌ఓ సుహాసిని సిబ్బంది, స్వాధీనం చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా ఎర్ర చందనం దుంగలు పట్టుబడ్డాయి. పట్టుబడిన ఎర్ర చందనం పట్టుబడిన ఎర్రచందనం దుంగలను వెంకటగిరి రేంజర్ కార్యాలయానికి తరలించారు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఆర్‌ఓ సుహాసిని హెచ్చరించారు.

## నాయుడుపేటలో భారీవర్షాలు

### -ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి,మామిడికాలువ

నాయుడుపేట, అక్టోబరు 25 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడుతున్న మరో అల్పపీడన ప్రభావంతో సూళ్ళూరుపేట నియోజకవర్గంలో భారీవర్షాలు కురుస్తున్నాయి. గతవారం రోజుల నుండి వరుసగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.గ్రామాల్లో ఉన్న చెరువుల్లో వరదనీరు చేరుతుంది.వర్షాలకు పంటపొలాలు నీటమునిగాయి.నాయుడుపేటలో స్వర్ణముఖి, మామిడికాలువలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. పట్టణంలో వర్షాలు కారణంగా పారిశుద్ధ్యం లోపించి అంటురోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని వాపోతున్నారు. వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్ అధికారులు తెలియజేస్తున్నారు. స్వర్ణముఖి, మామిడి కాలువల వద్దకు ఎవ్వరు చేపలవేటకు వెళ్ళరాదని అధికారులు తెలిపారు.

## మదర్ తెరిసా వృద్ధాశ్రమంలో అన్నదానం

వెంకటగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: స్థానిక మదర్ తెరిసా వృద్ధాశ్రమంలో వృద్ధులకు సిఐ ఏవి రమణ అన్నదానం నిర్వహించారు. మహిధర్ అనే చిన్నారి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. యువతరం ఫౌండేషన్ వారు మదర్ తెరిసా వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. వృద్ధులకు శ్రీనివాసులు ఆశ్రమం ఏర్పాటు చేసి వారికి సేవలు నిర్వహించడం అభినందనీయం తెలిపారు.

## నవంబర్ 1 చలో హైదరాబాద్

వెంకటగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గావాయిపై దాడికి నిరసనగా నవంబర్ ఒకటో తేదీ చలో హైదరాబాద్ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ పల్లిపాటి రవి తెలిపారు. కంపాలెం అరుంధతివాడలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ గవాయి పై జరిగిన దాడిని ఖండిస్తూ నవంబర్ 1వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే నవంబర్ 15వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి టౌన్ అధ్యక్షుడు కంటి పల్లి మనీ, పెంచలయ్య, లంక రవి, శ్రీను, లంక శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డిమాండ్ల సాధనకు కాపులందరూ ఐక్యంగా పోరాడాలి



వెంకటగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: డిమాండ్ల సాధనకు కాపులందరూ ఐక్యంగా పోరాడాలని కాపు బలిజ సంక్షేమ సంఘం ట్రస్ట్ చైర్మన్ తోట కృష్ణయ్య తెలిపారు. రాష్ట్ర స్థాయి కాపు బలిజ సంఘాల ఐక్య సమ్మేళన సమావేశం ఘనంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి ఈ సమావేశానికి భారీ ఎత్తున హాజరై పై కార్యక్రమాన్ని చాలా దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది. రాష్ట్రంలో చాలా కాపు సంఘాలు ఉన్నాయి అవి అన్ని ఒకే గొడుగు కిందకి వచ్చి రాష్ట్రస్థాయి ఒకే సంఘంగా ఏర్పడి ఒకే సంఘం ఒకే రాష్ట్రం అన్నట్టుగా ఉంటే దానికి బలం ఉంటాదని తెలిపారు.నాయకులు శ్రీ దాసరి రాము, ఆమంచి స్వాములు, తెలగపల్లి రాఘవయ్య, త్రిమూర్తులు, చందు జనార్ధన్, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ



శ్రీసిటీ (తడ), అక్టోబర్ 25 ప్రభాతవార్త: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా వైయస్సార్ సిపి రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 28వ తేదీ నియోజకవర్గ స్థాయిలో ప్రజా ఉద్యమం చేపట్టనుంది సూళ్లూరు పేట ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా బయలు దేరి ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించ నున్నారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశాలతో మేరకు మండల వైసిపి కన్వీనర్ కెళివి ఆర్ముగం సూచనల మేరకు మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ శనివారం తడ పున్నమి రెస్టారెంట్ నందు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కామిరెడ్డి నందారెడ్డి,రమేష్,మునస్వామిరెడ్డి,మురుగన్, రమణయ్య,సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాలను ఆర్డీవో పరిశీలన

శ్రీసిటీ (తడ), అక్టోబర్ 25 ప్రభాతవార్త: తుఫాను ప్రభావంతో జిల్లాలో రానున్న ఐదు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తడ మండలం లోతట్టు ప్రాంతాలైన కాదలూరు, వెండ్లూపాడు గ్రామాలను సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, తడ తహసిల్దార్ శరత్ బాబు పరిశీలించారు. ప్రజలకు సమస్యలు ఏవైనా ఉంటే 8106484322 ఈ నెంబర్ సంప్రదించాలని ఎమ్మార్వో శరత్ బాబు ప్రజలను కోరారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : న్యాయమూర్తి

గూడూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త: బాల్యవివాహాలు నేరమని, ఎక్కడైనా జరుగుతుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని న్యాయమూర్తి సులోచన రాణి సూచించారు. గూడూరు పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. గూడూరు పట్టణంలోని కోర్టు ఆవరణలో బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాల గురించి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకట నాగ పవన్, న్యాయవాదులు రజనీకాంత్ రెడ్డి, రమేష్ నాయుడు, భాగ్యలక్ష్మి పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్‌పై అవగాహన : ఎక్సైజ్

చిల్లకూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త : మండలంలోని ఆరు మద్యం దుకాణాలను ఎక్సైజ్ ఎస్.ఐ మహేష్ తన సిబ్బందితో శుక్రవారం, శనివారాలలో తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ముఖ్యంగా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన నాణ్యమైన మద్యాన్ని ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకువచిందని, క్యూఆర్ కోడ్ గురించి దుకాణం యజమానులకు, దుకాణంలో పనిచేసే సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. బెల్ట్ షాపులకు మద్యం ఇవ్వకుండా స్టాక్ యొక్క వివరాలను తనిఖీ చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకా ఈ తనిఖీలో ఎక్సైజ్ సిబ్బంది సి. హెచ్. మస్తానయ్య, ఎం.రవి, పి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మంథా తుఫాన్ కు ముందే అప్రమత్తం: ఎస్ఐ

పెళ్లకూరు అక్టోబర్ 25 ప్రభాతవార్త : కేంద్ర వాతావరణ శాఖ ఆదేశాలు మేరకు మంథా తుఫాన్ దూసుకువస్తున్న నేపథ్యంలో మండలంలోని ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని పెళ్లకూరు మండల ఎస్ఐ కె.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.పిడుగులు పడే అవకాశం ఉన్నందున పశువులు, గొర్రెలు, మేకలు తదితర జీవాలను మేతకు తీసుకెళ్ళకుండా సురక్షిత ప్రాంతాలలో ఉంచాలన్నారు.

## హౌసింగ్‌పై సమీక్ష సమావేశం



వాకాడు, అక్టోబర్ 25 ప్రభాతవార్త: మండల పరిషత్ కార్యాలయంలోని శనివారం గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హౌసింగ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస యోజన గ్రామీణ్ అనే పథకం కింద పక్కా గృహాలు మంజూరు చేసుకునేడా నికి కేంద్రం ప్రభుత్వం అవాస్ ప్లస్ సర్వే అనే యాప్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని, ఆ యాప్‌లో 404 ఎర్రర్ వస్తున్నా సందర్భంగా ఆ యాప్‌ను పరిశీలించారు. మండలం లోని మొత్తం 1809 గృహాలకు దరఖాస్తులు వచ్చి ఉన్నాయని వాటి పూర్తి సమగ్ర సర్వే కోసం సచివాలయ సిబ్బంది వచ్చి సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ యండీ. షబ్బీర్ ఎంపీడీఓ సాయి ప్రసాద్, ఇన్చార్జి భాస్కర్ రావు, హౌసింగ్ సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రమేష్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసిన డిఎస్పీ,ఎంవిఐ




శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త : కర్నూలులో బస్సు దగ్ధమైన సంఘటనతో తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణ ఎపి సీడ్స్ సర్కిల్ వద్ద ప్రైవేట్ ట్రావెల్ బస్సులను తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో శ్రీకాళహస్తి డిఎస్పీ కె.నరసింహ మూర్తి, మోటార్ వెహికల్ అధికారి దామోదర్ నాయుడు,వన్ టౌన్ సిఐ ప్రకాష్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వాహన పత్రాలు, లగేజీ పరిమితి, అత్యవసర ద్వారాలు సరిగా వున్నాయా, లేదా అనే విషయాలను క్షుణంగా పరిశీలించారు. దీనిలో భాగంగా డ్రైవర్స్ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు కూడా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ కె.రవి.కె.వెంకటరమణ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కార్తీక మాసంలో శ్రీకాళహస్తి ఆర్టీసి ప్రత్యేక ఆఫర్

శ్రీకాళహస్తి, కార్తీక మాసం సందర్భంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో భక్తులకు ప్రత్యేక ఆలయాల సందర్శనాల ఆఫర్‌ను ప్రవేశ పెట్టింది. శ్రీకాళహస్తి నుండి గుడిమల్లం, అప్పలాయిగుంట, వకుళమాట, ముక్కోటి, తలకోన ఒకే రోజు అయిదు ప్రసిద్ధ దేవాలయాల దర్శనం కల్పించనున్నారు. అలాగే దీపారాధన చేసుకునే అవకాశం వుందని, ప్రయాణ చార్జీలు రు.450/-లుగా నిర్ణయించడమైనదని, సోమవారం 27వ తేది ఉదయం 5గంటలకు బయలుదేరి సాయంత్రం 5గంటలకు శ్రీకాళహస్తి చేరుతుందని డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మామిడి రైతులకు ప్రభుత్వ సబ్సిడీ అందించాం

### ఉద్యానవన శాఖాధికారి సౌజన్య

పుత్తూరు, అక్టోబరు 25 ప్రభాతవార్త : మామిడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ మొత్తాన్ని ఒక కేజీ మామిడికాయలకు 4 రూపాయల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశామని పుత్తూరు ఉద్యానవన శాఖాధికారి జి.వి.సౌజన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల ఆధార్ కార్డు లింక్ వున్న బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము వేసినట్టు స్పష్టం చేశారు. ఆధార్ మ్యాపింగ్ జరగని, ఆధార్ అప్‌డేట్ కానటువంటి వారి బ్యాంక్ ఖాతాలకు జమ కాలేదని అయితే బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ లేకపోయినా, ఆధార్ అప్‌డేట్ కాకపోయినా సరే... అలాంటి రైతుల ఖాతాలకు కూడా సబ్సిడీ మొత్తం వేసే విధానం అమలు చేయడం కోసం ప్రభుత్వానికి అటువంటి రైతుల ఖాతాలు పంపించామని వివరించారు. చెల్లని ఆధార్ జాబితా కూడా ఆధార్ సవరణ చేసి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. అందువల్ల మామిడి రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మామిడి కాయలు తోలిన ప్రతి ఒక్క రైతు ఖాతాకు సబ్సిడీ మొత్తం విడతల వారీగా జమ అవుతుందని తెలిపారు. రైతులు తమ సమస్యలపై దరఖాస్తులు ఇచ్చేందుకు ఈ నెల 30వ తేదీ వరకూ గడువు వుందని తెలిపారు. ఆ లోగా మార్కెట్ యార్డ్‌లో వున్న ఉద్యానవన శాఖాధికారి కార్యాలయంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌కు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. అర్జీలు ఇచ్చిన ప్రతి రైతు దరఖాస్తును పరిశీలించి మళ్లీ ప్రభుత్వానికి జాబితా పంపించి వారికి కూడా తప్పనిసరిగా సబ్సిడీ మొత్తం జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టీకరించారు.

**రైతుల అభిప్రాయాలు :**

లియోన్ ఫ్యాక్టరీకి 4120 కేజీల మామిడి కాయలు పంపిణీ చేయగా దానికి గాను ప్రభుత్వ సబ్సిడీ మొత్తం రూ. 16,480 వేలు జమ అయింది.

**:మేళం రామకృష్ణ, ఎస్‌బిఆర్ పురం, వడమాలపేట మండలం.**

శ్రీ వర్ష ఫ్యాక్టరీకి 9 టన్నుల మామిడి కాయలు తోలగా ప్రభుత్వ సబ్సిడీ మొత్తం రూ. 36,120 వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేశారు

**: పి.భాస్కర్‌నాయుడు, వడమాలపేట**

లియోన్‌తో పాటు మరో ఫ్యాక్టరీకి 22.9 టన్నులు మామిడికాయలు పంపిణీ చేయగా మొత్తం 91,932 వేలు నా ఖాతాలో జమ అయింది. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకున్నందుకు సంతోషంగా వుంది.

**టి.కేశవులు, కె.బి.ఆర్.పురం, పుత్తూరు రూరల్ మండలం**

## శ్రీకాళహస్తిలో జాబ్‌మేళా




తొట్టంబేడు,అక్టోబర్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి లోని విక్రమ్ పాఠశాల ఆవరణలో శనివారం జాబ్‌మేళాను నిర్వహించారు. శ్రీకాళహస్తిలోని నిరు ద్యోగులకు ఉపాధి కల్పనలో భాగంగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ మెగా జాబ్‌మేళాను నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయ్‌మెంట్, సిడాఫ్ సారధ్యంలో జాబ్ మేళాను నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి హాజర య్యారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిరుద్యోగులు 20లక్షల మందికి ఉపాధి అవకాశం కల్పించు టకు నిర్ణయించారు. ఎంపికైనవారికి రూ.13 నుంచి 20వేల వరకు కనీస వేతన సదుపాయం కల్పించామన్నారు. త్వరలో శ్రీకాళహస్తి నియోజక వర్గంలో డిగ్రీకళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలను కల్పిస్తామ న్నారు. ఈ కార్యక్రమాల్లో విక్రమ్ గ్రూప్ చైర్మెన్ డాక్టర్‌చంద్రశేఖర్, డియస్‌డిఓ ఆర్ లోకనాథం,ప్రిన్సిపల్ పటాభి,మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ చెంచయ్యానాయుడు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాలో 312 మంది హాజరు కాగా 123మంది ఉద్యోగ అర్హత పొందారన్నారు.37 మంది హాజరు కాలేదన్నారు.

## గోవిందనామ సంకీర్తనలతో పులకింత



తిరుపతి,అక్టోబర్ 25ప్రభాతవార్త: కార్తీకమాసంలో ఆధ్యాత్మికనగరం తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ప్రతి శనివారం చేపట్టే నగర సంకీర్తన భక్తుల్లోనూ ఆధ్యాత్మిక భావం పెంపొందించేలా ఉందని రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. కళాకారులు తొండడమనాటి సుబ్రమణ్యంరెడ్డి,కొండెచెంగారెడ్డి,వెంకటేశ్‌రెడ్డి, ప్రభాకం రెడ్డి, సుధాకర్‌చౌదరి, విగ్రహాల కల్యాణి, సుశీల,మునికుమారి, పద్మ, కల్పన, పార్వతి, ధనలక్ష్మి, నిర్మల వాసురెడ్డి, మునినాథరెడ్డి, కస్పాపద్మనాభం, శాంభోలు హరినాథ్, పోన్నాలజేజిరెడ్డి తదితరులు తిరునామం ధరించి భజనలు చేసుకుంటూ కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## మొంథా తుఫాను భయం

### - అధికార యంత్రాంగం అప్రమత్తం : కలెక్టర్ వెంకటేశ్వర్

కోట,అక్టోబర్ 25 ప్రభాతవార్త : మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కరవనున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్.వెంకటేశ్వర్ కోరారు. శనివారం ఆయన మండల స్థాయి అధికారలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మొంథా తుఫాన్‌ను తేలికగా తీసుకోరాదని ఈనెల 27,28,29 తేదీల్లో ఇది మరింత ప్రభావాన్ని చూపుతుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల స్థాయి అధికారులు వారికి కేటాయించిన కేంద్రాల్లో ఉండాలన్నారు. పోలీస్, అగ్నిమాపక, ఇరిగేషన్, పంచాయతీరాజ్, అర్అండ్‌బి తదితర అనుబంధ శాఖలు సమన్వయము చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్థంబాలు, తదితర పరికరాలను ముందుగానే సమకూర్చుకొని విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. ఆశాఖ సంబందించిన సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో వారి వారి ప్రాంతాల్లో ఉండాలన్నారు.సచివాలయ సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా డిసిఓ చూసుకోవాలన్నారు.

## నేడు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా ఆదివారం జనసేన పార్టీకి చెందిన కొట్టెసాయి ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ప్రకటించారు. ఆయన ప్రమాణస్వీకారం అంజంజి వినాయక ఆలయం వద్ద నిర్వహించుటకు పరిశీలిస్తున్నారు.ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయం జారి చేసిన ప్రకటనలో కొట్టె సాయి ప్రసాద్ ప్రమాణ స్వీకారానికి సంబంధించి ఉదయం 9.30గంటలకు బహాదూరుపేట నుంచి ర్యాలిగా బయలుదేరి శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకుంటారన్నారు. 11.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారు.ఈ కార్యక్రమాలకు జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు ఎన్‌డిఏ నాయకులు పాలక మండలి సభ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలో ఫ్లెక్సీలు నిండాయి.

**ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో సమావేశం:**

ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో జనసేనకు చెందిన కొట్టె సాయి ప్రసాద్ ప్రమాణ స్వీకారం తరువాత పట్టణలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ కళ్యాణ మండపంలో జనసేన పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదేండ్ల మనోహర్ హాజరై కార్యకర్తలకు దిశ దెశ నిర్దేశంతో పాటు పార్టీ భవిష్యత్తు కార్యక్రమాలను వివరించనున్నట్లు వివరించారు.ఈ మేరకుఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

## డ్రైవర్లూ సురక్షిత ప్రయాణం ధ్యేయం కావాలి

### -తిరుపతి జిల్లాలో ట్రావెల్ బస్సులు తనిఖీలు



తిరుపతి,అక్టోబర్ 25ప్రభాతవార్త: కర్నూలు విషాదఘటనతో రాష్ట్రప్రభుత్వం ఆదేశాలతో తిరుపతి జిల్లాలో పోలీసు,రవాణాశాఖ అధికారులు సంయుక్తంగా శనివారం సాయంత్రం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై మెరుపుదాడులు చేశారు. ఈ తనిఖీల్లో బస్సుల్లో ఉన్న సీట్ల సామర్థ్యం, లగేజీబాక్సుల్లో ఉంచే లగేజీ వస్తువులు తదితర వాటిని క్షుణ్ణంగా తనిఖీచేశారు. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బ రాయుడు, జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశాలతో అదనపు ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఎంవిఐలు సంయుక్తంగా ఆర్టీసి బస్టాండు సమీపంలో, రామానుజకూడలి, లీలామహల్‌కూడలి, కరకంబాడి ప్రాంతాల్లో ఈ ఆకస్మిక తనిఖీలు చేశారు. బస్సు డ్రైవర్లకు తగిన సూచనలు చేశారు. ప్రయాణీకుల భద్రత,సురక్షిత ప్రయాణం లక్ష్యంగా బస్సులు నడపాలని ఆదేశించారు. బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవర్ల లైసెన్సులు, ప్రథమచికిత్స కిట్లు పరిశీలించారు.

## వెంకటేశ్వరుని గ్రామోత్సవం



వడమాలపేట, అక్టోబరు 25 ప్రభాతవార్త: అప్పలాయగుంటలో అభయ హస్తంతో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం ఊంజల్‌సేవ, గ్రామోత్సవం వైభవంగా జరిగింది. వేకువ జామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చిగా స్వామి వారు గంటపాటు చిద్వి లాసంగా ఊయలలూగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోమించి మాడవీధుల్లో విహరించగా భక్తులుమొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, అర్చకులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.


